ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
19 జూన్, 2011

నల్లమల పులుల సామ్రాజ్యం

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 జూన్ 19 నుంచి
2011 జూన్ 25 వరకు)

ఎన్. ఆదిత్య
4సం॥, జూన్-23
కుమారి-ఈశ్వర్
పాచిపెంట-విజయనగరం

జి. సాత్విక్
4సం॥, జూన్-2007
కల్పన-సాగర్
సప్తగిరికాలనీ-కరీంనగర్

సాత్విక్‌కృష్ణ
1సం॥, జూన్-2010
సరిత-నరేష్
హరియా-నల్లగొండ

కె. మనస్విని
3సం॥, జూన్-23
అరుణ-మోహన్
పెద్దతుంబళం-కర్నూలు

బి. నితిష
1సం॥, జూన్-25
అను-శ్రీను
చెన్నారెడ్డిగూడ-రంగారెడ్డి

సిహెచ్. చేతన్‌గౌడ్
2సం॥, జూన్-2009
మంజుశ్రీ-జంగయ్యగౌడ్
రెడ్డిబావి-నల్లగొండ

ఎ. అంకిత
3సం॥, జూన్-19
లక్ష్మి-ఆంజనేయులు
జరుగుమల్లి-ప్రకాశం

సిహెచ్. సిరి
1సం॥, జూన్-22
పావని-లక్ష్మీనారాయణ
రాంనగర్-కరీంనగర్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

'మెగా' ఎపిసోడ్ ...!



ఇంతన్నాడంతన్నాడే గంగరాజు/ ఇంటెనకా నుయ్యన్నాడే గంగరాజు ... ఇలా మొదలై సాగే జానపద గీతంలో- ప్రేమికుడి డాంబికాల చిట్టాలను బట్టబయలు చేస్తుంది ఒక వనిత. ఇలాంటి సొరకాయ కోతలకు రాజకీయాల్లో అయితే కొదవే ఉండదు. 'కూత బ్రహ్మాండమంత ... చేత మర చెంబంత' అన్న సామెత కొంతమందికి అక్షరాలా సరిపోతుంది! తన రూటే సపరేటని 'మార్పు' కోసం బయల్దేరి, గమ్యం చేరకుండానే తానే మారిపోవడం వింతల్లోకెల్లా వింత కాదా? తొడ కొట్టి తిట్టిన 'చేతి'కే తెగ వంత పాడడం అవకాశవాద వైచిత్రి కాక మరేమిటి? వెక్కిరించిన విపక్ష గూటికే చేరుకొని... 'ఆహా.. ఏమి ఈ గృహ సౌందర్యమూ... ' అని ప్రస్తుతించటం ఎంత విడ్డూరం! డ్రైవరుకి మార్గం మీదా, గమ్యం మీదా సరైన స్పష్టత లేకపోతే- బండి ఎక్కడికి చేరుతుందో చెప్పటానికి ఈ 'చిరు' ఉదాహరణ చాలు!

'అదిగో నవలోకం.. వెలసే మనకోసం' అని సారథి బోలెడు సొంగులు సింగి, డైలాగులు దంచితే ... నిజమే కాబోలు అనుకున్నారు జనం! కానీ, అట్టహాసంగా బయల్దేరిన బండి విచిత్రంగా తిట్టిపోసిన ఇంటిముందే చతికిలపడింది. సహజ ధర్మానికి విరుద్ధంగా అరచేతిలో ఉదయించే సూర్యుడు అస్తమించిపోయాడు! పోనీ, వ్రతం చెడింది ఫలితమన్నా దక్కిందా? అంటే అదీ డౌటే! చిన్నపాటి నిర్ణయాలకు కూడా హస్తిన చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తోంది... 'హస్త'మించే సభ జరుపుకోవటానికి కూడా హస్తిన అనుజ్ఞ కోసం వేచి చూడాల్సి వస్తోంది! ఇన్నాళ్లూ తానే డేట్లూ, కాల్షీట్లూ ఇచ్చి - ఇప్పుడు వాటికోసం తానే నిరీక్షించడం విచిత్రమే మరి! 'మనమే కాబోయే కింగులం' అన్న నోట నుంచి 'అంతా అమ్మ దయ' అనుకోవడం ఎంతలో ఎంత మార్పు! స్వయం ప్రకాశం అనుకున్న స్టారు పరాన్న కిరణాలకోసం పాకులాడడం ఏ సినిమా స్క్రిప్టుకూ అందని విచిత్ర మలుపు.

పరువు పోయినా పదవి దక్కుతుందా?... చేతిమార్కు రాజకీయంలో ఆఖరిదాకా ప్రతిదీ సస్పెన్సే... ఎప్పుడు ఏ కత ఏ మలుపు తిరుగుతుందో అక్కడ ఎవరికీ తెలియదు. గాలివాటు విధానంలో ఎప్పటికి ఏది లాభమైతే అది సాగుతుంది. ఆ కప్పల తక్కెడలో పాపం.. 'చిరు' జీవి ఎలా ఏగేనో... ఎలా తూగేనో..!! ప్రతి కథలోనూ ఒక నీతి ఉంటుంది. ప్రతి వైఫల్యంలోనూ ఒక పాఠం ఉంటుంది. తిరుపతిలో మొదలై ఢిల్లీదాకా ... సాగిన టూరు ఎపిసోడ్‌లోనూ ఒక మంచి గుణపాఠం ఉంది, తీసుకోగలిగితే ...!!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

జ్ఞాపకాలు... 4
ప్రజాకళాకారుడు హుస్సేన్



ఈ పేజ్ ... 10
పాస్‌వర్డ్ పదనిసలు



చూద్దామా ... 12
అందాల సిడ్నీ

అరువు అందాలు ... 17



నోరూరించాయ్

'అందం వెనుక అమానుషం' వ్యాసం హృదయాన్ని కదిలించింది. రావుల కిరణ్మయి 'జ్ఞానోదయం' కథ బావుంది. 'వికాసం'లోని వ్యాసాలు విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. 'బాలనేస్తాలు' కాలక్షేపాన్నిస్తోంది. చాక్లెట్ల చిత్రాలు నోరూరించాయి. 'ఈ పేజ్'లో అందరూ తెలుసుకోవాల్సిన టెక్నాలజీకి సంబంధించిన సమాచారం ఉంటోంది. 'వికాసం'లో ఒత్తిడికి గల కారణాలు, వాటి విశ్లేషణ, పరిష్కారాలు తెలియజేసినందుకు అభినందనలు. 'సినిమా కబుర్ల'లో విభిన్నమైన అంశాలు తెలుస్తున్నాయి. 'మనలో మాట' నిరసనల వెనకున్న వాస్తవాల్ని అభివ్యక్తీకరించింది. 'అడవి పూచిన వెన్నెల' రచయిత విజయ్‌కుమార్‌కి హృదయపూర్వక అభినందనలు. కవితలన్నీ భావగర్భితంగా ఉన్నాయి.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

చూడాలనిపించే నందనవనం

ఈవారం చూద్దామా అందించిన సుందర దృశ్యాల నందనవనం మమ్మల్నందరినీ ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్ లోని సందాక్ ఫూ ట్రెకింగ్ విషయాలెన్నో వివరించారు. నేపాల్, డార్జిలింగ్ ఘాట్‌రోడ్డు, మేఘావృతమైన ప్రకృతి అందాలు, మంచు శిఖరాలు... అన్నీ ఎప్పుడెప్పుడు చూద్దామా అనిపించేలా ఉన్నాయి. అలాగే గత వారం అందించిన 'కొచ్చి' విశేషాలు అలరించాయి. మన దేశంలో మరెక్కడాలేని చైనీస్ ఫిషర్ నెట్ గురించి చదివాక అవి ఎలా ఉంటాయో చూడాలనిపిస్తోంది.

నూతి నారాయణ,
గద్దిఅన్నారం.

ఇంత దారుణమా?!

అందంగా ఉండడానికి ఇంత దారుణంగా ప్రవర్తించాలా? మనుషుల రోగాలు తగ్గించడానికి జంతువులమీద ప్రయోగాలు చేస్తారని తెలుసు కానీ, అందం కోసం ఇంత భయంకరమైన చిత్రహింసలు పెడతారా? అనిపించింది ఈ వారం అట్టమీద కథ చదివాక. కాస్మొటిక్స్ కోసం పక్షులను, జంతువులను బలిచేయడం దారుణం. వాతావరణ కాలుష్యం కూడా మనుషుల మానసిక ఒత్తిడికి కారణమౌతోంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

యువతకు ఆదర్శం

అట్టమీది కథ 'అందం వెనుక అమానుషం' చదివాక మనిషి తన స్వార్థం కోసం ఏమైనా చేయగలడనిపిస్తోంది. 'అడవి పూసిన వెన్నెల' రాసిన విజయ్ కుమార్ నేటి యువతకు ఆదర్శం. కెరటం శీర్షిక సందేశాత్మకంగా ఉంటోంది. 'అబ్బ! పోనిద్దురూ...' కథలో మనిషి ఆలోచనల గురించి రచయిత చాలా బాగా చెప్పారు.

మోతి మోహనరంగ, సూర్యాపేట్.

అన్నింటా వారేనా!?

'ఈ పేజ్'లో ఇక సిమ్ అక్కర్లా...! బాగుంది. నాలుగు సిమ్ కార్డులు ఒకే మొబైల్‌లో ఉండడమే ఆశ్చర్యమనుకుంటుంటే అసలు సిమ్ కార్డే లేకుండా సెల్‌ని వాడొచ్చు అంటే నమ్మలేకపోతున్నాం. అయితే వీటి వల్ల ఎంత ఉపయోగముంటుందో అవి వచ్చాక కానీ తెలీదు. రెండవ పేజీలో కార్టూన్లు బావుంటున్నాయి. ఈ వారం పీపీ అందించిన 'సినిమా కబుర్లు' బాగున్నాయి. సినిమాలు చాలవన్నట్లు సినీ తారలు రకరకాల యాడ్స్‌లో కూడా దర్శనమిస్తున్నారు. ఇంతకుముందు వాటిలో కొత్త కొత్త వాళ్లను చూసేవాళ్లం. ఇప్పుడు చిన్న తెరలో, వెండి తెరలో అన్నింటా ఆ మొహాలనే చూస్తున్నాం. చాక్లెట్ల రూపాలు నోరూరించాయి.

మమత, గుంటూరు.



ఎన్నో విషయాలు

'ఒత్తిడి అనే చక్రవ్యూహంలో...' వ్యాసం చదివాక దాని గురించి పూర్తి అవగాహన కలిగింది. ఒత్తిడికి కారణాలు, చికిత్స వంటి ఎన్నో విషయాలను చక్కగా వివరించారు. 'జ్ఞానోదయం' కథ బాగుంది. 'అడవి పూసిన వెన్నెల' రచయిత విజయ్ కుమార్ అభినందనీయుడు.

యాదగిరి, వరంగల్.





SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో
ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: [| | | | |]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

జ్ఞాపకాలు



ప్రజా కళాకారుడు హుస్సేన్

హుస్సేన్‌ను తన సమకాలికుల్లోకెల్లా ఉన్నతంగా నిలిపే అంశమేమిటంటే ఎటువంటి అంశాన్ని అయినా మనోహరంగా, వినూత్నమైన రీతిలో చిత్రించగలగడం. అన్ని రకాల కళా రూపాల్లోను ఆయనది అందెవేసిన చేయి. పోస్టర్ల తయారీ దగ్గర నుంచి అబ్బురపరిచే పెయింటింగ్స్, పిల్లల ఆటవస్తువుల తయారీ వరకు అన్నిటిలోనూ ఆయన విశేష ప్రావీణ్యం ప్రదర్శించారు. వలస పాలనలో రాజా రవి వర్మ మాదిరిగానే, ఆధునిక దృక్పథంతో సాంప్రదాయిక రీతులను మేళవిస్తూ జన రంజకంగా, ఆకట్టుకునేలా బొమ్మలు గీయడంలో హుస్సేన్ అనిర్వచనీయమైన కృషి చేశారు.

- సునీత్ చోప్రా

మక్బూల్ ఫిదా హుస్సేన్ ఇక లేరు. 96 ఏళ్ల నిండు జీవితం గడిపిన హుస్సేన్ ఈ నెల 8వ తేదీ ఉదయం లండన్‌లో కన్నుమూశారు. మాతృభూమి అయిన భారత్‌కు తిరిగిరాలేని స్థితిలో ఆయన తనువు చాలించారన్న వార్త నా లాంటి వారికి ఎంతగానో బాధ కలిగించింది. ఆయనను సరిగా అర్థం చేసుకోలేనివారు దుర్బుద్ధితో రకరకాల కేసులు పెట్టి, దుర్భాషలాడుతూ ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారు. కళాకారులు, కళాభిమానుల దృష్టిలో కళ అంటే ఏమిటి? మన జానపద, సాంప్రదాయక కళలకు ప్రాతినిధ్యం వహించే సమున్నత సంప్రదాయాలను కళాకారుడు ఎలా చూస్తాడు? సమకాలీన కళ అంటే ఏమిటి? అనే అంశాలపై లేనిపోని ఆరోపణలు చేసి భారత దేశంలోని అత్యధిక ప్రముఖ కళాకారులలో ఒకరైన వ్యక్తి స్వీయ ప్రవాసంలోకి వెళ్ళి, మరణించే పరిస్థితి సృష్టించారు. ఆయనపై చేసిన ఆరోపణల్లో పేర్కొన్న విధంగా ఆయన కళ శాంతి భద్రతల సమస్యను సృష్టించలేదు. మితవాద, ఛాందసవాద గ్రూపులు ద్రోహబుద్ధితో తలపెట్టిన చర్యలే అటువంటి సమస్యను సృష్టించాయి. ఆయన ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించడం, అహ్మదాబాద్‌లోని ఆయన మ్యూజియంను ధ్వంసం చేయడం, ఢిల్లీలో ఆయన చిత్ర ప్రదర్శనపై దాడులు వంటి అకృత్యాలతో వాణిజ్య కళా ప్రపంచంలో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఢిల్లీలో ఆయన నిర్వహించిన కళా ప్రదర్శనలో కళావర్తకులు కూడా ఆయన గీచిన చిత్రాలను ప్రదర్శించకుండా స్వయం నిషేధం విధించుకోవాల్సిన పరిస్థితి! ఆసక్తికరమైన విషయమేమిటంటే వారు దాడి జరిపిన ప్రతిసారీ కొత్త, యువ కళాభిమానులు ఆయన చిత్రాలను చూడడానికి ఆతృతగా ఎగబడేవారు. మాంద్యం కారణంగా కళారంగం కూడా సంక్షోభంలో పడినప్పటికీ ఆయన గీసిన కళాఖండాలకు ఆదరణ తగ్గలేదు. అవి ఎప్పటిలానే సులువుగా అమ్ముడుపోయేవి. ఇటీవల లండన్‌లో నిర్వహించిన వేలంలో ఆయన గీచిన కొన్ని పెయింటింగ్స్‌కి 2.32 కోట్ల రూపాయల ధర పలికింది. ఆయన ఈ రంగంలో చివరి దాకా విజేతగానే నిలిచారని చెప్పాలి. మంచి కళాత్మక చిత్రాలకు విలువ ఎప్పుడూ ఉంటుంది. స్టాక్ మార్కెట్ షేర్ల ధరల్లో ఉత్థాన పతనాలు ఉంటాయి. కానీ, హుస్సేన్ చిత్రాలకు మాత్రం విలువ పడిపోవడమనేదే ఎన్నడూ ఉండదు. కొన్ని కంపెనీలు మార్కెట్‌లో పడిపోయిన షేర్ల ధరలను సెలబ్రిటీల సాయంతో నిలబెట్టుకునే ప్రయత్నాలు చేస్తుంటాయి. హుస్సేన్ చిత్రాలు ఎప్పుడూ ఉన్నత స్థితిలోనే ఉంటాయి. ఆయన చిత్రాలు అంతగా ఆకట్టుకోవడానికి కారణం వాటిలో అంతర్లీనంగా ఉండే ఒక గొప్ప దార్శనికత. సామాన్యుల జీవితాలు, మన కళాకారులకు ఎంతో స్ఫూర్తినిచ్చిన జాతీయోద్యమంలో వారు చేసిన త్యాగాలు, సామ్రాజ్యవాద బానిసత్వం, స్థానికంగా ఉన్న వారి తాబేదారులు, రాజుల నుంచి దేశాన్ని విముక్తం గావించడం, ఇటువంటి వాటికి దగ్గరిగా ఆయన దార్శనికత ఉంటుంది. 1947లో హుస్సేన్ అభ్యుదయ కళాకారుల బృందంలో చేరారు. ఆ బృందం ఇటువంటి ఆశయాల కోసమే పాటుపడేది. ఆ తరువాత కొన్నేళ్లకు ఆ బృందం కార్యకలాపాలు ఆగిపోయాయి. దాని భావన గురించి 1955లో తన 'జమీన్'లో హుస్సేన్ చాలా శక్తిమంతంగా వ్యక్తీకరించాడు. దున్నేవాడికే భూమి అన్న అంశాన్ని ఆయన గీచిన రంగుల చిత్రంలో అద్భుతంగా వ్యక్తీకరించాడు. జానపద వైశిష్ట్యాన్ని, మౌర్యులు, గుప్తుల నాటి శిల్పకళా ప్రాశస్త్యాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అయిన పికాసో స్పెయిన్‌లోని ఫ్రాంకోలో జీవిస్తూ ప్రవాసంలో వుండగా మరణించాడు. పికాసో చిత్రాలు హుస్సేన్‌కు ఎంతగానో స్ఫూర్తినిచ్చాయి. ప్రజా కళాకారుడు సఫ్దర్ హష్మికి ఆయన నివాళులర్పిస్తూ గీచిన బొమ్మను చూస్తే ప్రజాతంత్ర పోరాటాల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అర్థమవుతుంది. హుస్సేన్‌ను తన సమకాలికుల్లోకెల్లా ఉన్నతంగా నిలిపే అంశమేమిటంటే ఎటువంటి అంశాన్ని అయినా మనోహరంగా, వినూత్నమైన రీతిలో చిత్రించగలగడం. అన్ని రకాల కళా రూపాల్లోను ఆయనది అందెవేసిన చేయి. పోస్టర్ల తయారీ దగ్గర నుంచి అబ్బురపరిచే పెయింటింగ్స్, పిల్లల ఆటవస్తువుల తయారీ వరకు అన్నిటిలోనూ ఆయన విశేష ప్రావీణ్యం ప్రదర్శించారు. వలస పాలనలో రాజా రవి వర్మ మాదిరిగానే, ఆధునిక దృక్పథంతో సాంప్రదాయిక రీతులను మేళవిస్తూ జన రంజకంగా, ఆకట్టుకునేలా బొమ్మలు గీయడంలో హుస్సేన్ అనిర్వచనీయమైన కృషి చేశారు. ఈ కళారీతుల మధ్య అంతస్సంబంధాన్ని అర్థం చేసుకోగల శక్తి, దార్శనికత వుంటే తప్ప అది సాధ్యం కాదు. భారత దేశ వలస కళా ప్రవక్తలు రాజరికపు పతనం, ట్రావెంకూర్ కోర్టులో కుతంత్రాలు వంటివాటిలో నిమగ్నమై ఉంటే, హుస్సేన్ భారతీయుల గుండె చప్పుడును సృజించాడు. ఆయన దృష్టి నుంచి ఏదీ తప్పించుకోలేదు. నిజాముద్దీన్ టీ షాపు, అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజా వద్ద టీస్టాల్, ముంబయిలోని కేఫ్ సమోవర్, కొల్‌కతాలోని అజాద్ హింద్ దాబా ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. కాలికి చెప్పులు లేకుండా గమ్యం తెలీని రీతిలో ఆయన తిరగాడిన రోజుల్లో కూడా ఆయన కుంచె దృష్టిని ఏదీ తప్పించుకోలేకపోయింది. అదే సమయంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మదర్ థెరిసా, సత్యజిత్ రే, బాలీవుడ్ తారలు ఇలా రకరకాల పాత్రలు ఆయన

కుంచెలో ఒదిగిపోయాయి. భారతదేశ వీధుల్లో నివసించే ప్రజల పట్ల కూడా ఆయన ఎంతో ఆసక్తి చూపేవారు. ఏనుగులు, పులులు, గుర్రాలు, ఇలా సకల రకాల జీవరాశులు ఆయన చిత్రాల్లో దర్శనమిస్తాయి. ఆయన కళా తపస్సుకు గుర్తింపుగా 1973లో పద్మ భూషణ్, 1991లో పద్మ విభూషణ్ అవార్డులు వరించాయి. 1986లో రాజ్యసభ సభ్యత్వం ఇచ్చారు. సభలో తన అనుభవాలను దృశ్యరూపం ఇస్తూ ఒక ఆల్బం విడుదల చేశారు.

రెక్కాడితేగాని డొక్కాడని కష్ట జీవుల కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయనకు వారి వ్యథార్థ గాథల గురించి బాగా తెలుసు. అందుకే వాటికి ఒక చిత్ర రూపమిచ్చేందుకు చిత్ర నిర్మాతగా అవతారమెత్తాడు. తను గీచిన కొన్ని చిత్రాలను పిల్లలకు, మిత్రులకు కానుకలుగా ఇచ్చాడు. దయార్ద్ర హృదయం గల కళాకారునిగా పేరుగాంచాడు. ఆయన నిజమైన వ్యక్తిత్వాన్ని ఇవి చాటిచెబుతాయి. ఆయన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేవారు. ప్రతి ఒక్కరిపట్ల ఆత్మీయ భావంతో మెలిగేవారు. వారి ప్రేమ, గౌరవాన్ని చవిచూసేవారు. అయితే అధికారంలో ఉన్నవారితో ఆయన సాన్నిహిత్యం ఆయనకు అనేకమంది శత్రువులను కూడా తయారుచేసింది.

నేను ఆయనను అనేక పర్యాయాలు కలుసుకున్నాను. హుస్సేన్‌లోని గొప్ప తనమేమిటంటే ఇతరులను ఆయన ఎన్నడూ విమర్శించేవారు కాదు. ఆయన దృష్టంతా తన భావవ్యక్తీకరణ గురించే ఉండేది. ఆయన దృష్టి అంతా తన మనసులోని ఆలోచనలను ఏ విధంగా కళారూపంలో ప్రదర్శిస్తున్నాననే అంశంపైనే. భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించిన తరువాత ప్రజల సంస్కృతిని, యువ నటీమణులు, బాలీవుడ్‌లో బందీ అయిన గ్లామర్ సంస్కృతికి ఆయన దృశ్య రూపక ప్రచారకర్తగా నిలిచారు. ఇంకో ముఖ్యమైన విషయమేమిటంటే ఆయన ఎంత సానుకూల దృక్పథంతో వ్యవహరించేవారో ఇతరులు తనను సవాలు చేస్తారేమోనన్న భయం కానీ, ఆందోళన కానీ ఆయనలో ఎన్నడూ కనిపించేవి కావు. తనలో దాగి ఉన్న ప్రతిభ ఏమిటో ఆయనకు స్పష్టంగా తెలుసు. దానిని గురించిన సంపూర్ణమైన అవగాహన ఆయకు ఉంది. తనను దూషించేవారిలో ఎవరు ఎటువంటివారో ఆయనకు తెలుసు. దుర్బుద్ధితో నోరు పారేసుకునేవారికి సమాధానమివ్వకపోవడమే మంచిది అని భావించేవారు. వారిని వారి మానానికి వారిని వదిలివేసి తాను ఏం చేయాలనుకున్నారో దానిని చేసుకుపోయేవారు.

ఆయన ఒక స్వేచ్ఛాజీవి. మనిషికి హద్దులు అంత ముఖ్యం కాదనేది ఆయన భావన. కులం, మతం, సాంప్రదాయాల పేరుతో మనుషుల మధ్య

అంతరాలను సృష్టించడాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మానవుల మధ్య అనుబంధాన్ని పెంచి ప్రజలందరినీ కలిసికట్టుగా ఉంచలేని వీటికి అర్థం లేదని ఆయన భావించేవారు.

స్వదేశంలో ఎన్నో బెదిరింపులు, వేధింపులు ఎదుర్కొన్నారు. ఆయన చిత్రీకరించిన చిత్రాలను ధ్వంసం గావించడం వంటి సంఘటనలు ఆయనను ఎంతగానో బాధించాయి. ఈ పరిస్థితుల్లోనే దేశం వీడి వెళ్లిపోయారు. ఖతార్‌లో చక్కటి ఆదరణ లభించడంతో 2010లో ఆ దేశ పౌరసత్వాన్ని స్వీకరించారు. అయినప్పటికీ ఆయన మనసంతా భారత్ పైనే ఉండేది. నేను ఖతార్‌లో నివసించినా, లండన్‌లో ఉన్నా నా మనసంతా భారత్‌పైనే ఉంటుందని తరచూ అంటుండేవారాయన. భారత్ తన శరీరం లోపల జనరేటర్ వంటిదని, అది ఎప్పుడూ చురుగ్గా, ఉత్సాహంగా పనిచేసేలా చేస్తుందని పేర్కొనేవారు. మాటల్లోనే కాదు, చేతల్లో కూడా ఆయన దీనిని వ్యక్తీకరించేవారు. అందువల్లనే చనిపోయే వరకు తనకు అత్యంత ప్రియమైన భారత దేశానికి సంబంధించిన విషయాలపైనే కళారూపాలను తీర్చిదిద్దారు.

ఎంఎఫ్ హుస్సేన్ మృతి పట్ల ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాపం వ్యక్తం చేస్తూ , ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. ప్రధాని మాటలతో ప్రతి ఒక్కరూ ఏకీభవిస్తారు. అయితే, హుస్సేన్‌పై వచ్చిన తప్పుడు కేసులను పరిష్కరించడంలో, స్వదేశంలో ఆయన తన పని తాను చేసుకునేందుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూడడంలో ప్రభుత్వ వైఫల్యం చెందడం కూడా ఈ పరిస్థితి ఏర్పడటానికి కారణమనడంలో అతిశయోక్తి లేదు. హుస్సేన్ ప్రపంచ కళాకారుడు. ఈ దేశం ఆ దేశం అనే కాదు ప్రపంచమంతటా ఆయన పెయింటింగ్స్‌ను అభిమానించేవారున్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని ఆయన ఎంతగానో ఆరాధించే గడ్డ మీద నుంచి వెళ్లగొట్టడం ద్వారా మన నాగరిక విలువలను మనమే దిగజార్చుకున్నట్లైంది. తమపై ఎదురుదాడి జరగవచ్చుననే భయంతో ఆయనను ఛాందసవాదుల శక్తుల దాడుల నుండి రక్షించలేకపోయిన వారు ఇప్పుడు తమను తాము నిందించుకోవాలి. హుస్సేన్ చాలా సౌమ్యుడు. "నాకు ద్రోహం జరిగిందని అనుకోవడం లేదు" అన్న ఆయన మాటలే ఇందుకు నిదర్శనం. ఆయన ఖతారీ పౌరసత్వం తీసుకుని ఉండవచ్చు. లండన్‌లో మరణించి ఉండవచ్చు. అయితే ఆయన కళాఖండాలను చూసినప్పుడల్లా ఆయన మన కళ్ల ముందు సాక్షాత్కారమవుతూనే ఉంటారు. ఆయన కళా నైపుణ్యాన్ని చూసి హుస్సేన్ జన్మ స్థలం అయిన మహారాష్ట్రలోని పాంధార్‌పూర్ ఎంతగానో గర్విస్తుంది. హైదరాబాద్ కలెక్టర్ బద్రీ నారాయణ పిత్తీ కోసం రామాయణ, మహా భారతం ధారావాహికను ఆయన రూపొందించారు. ఆ దృశ్య కావ్యాలు మా నగరాల్లో చాలా ఇళ్లలో దర్శనమిస్తాయి. ఆ పురాణ గ్రంథాల్లోని పాత్రలు నిత్యం మన సమాజంలో తారసపడుతూనే ఉంటాయి. యవ్వన ప్రాయంలో ఆయన తన చిత్రాల ద్వారా ముంబయికి వన్నె తెచ్చారు.ముంబయికి, ఆయనకు అవినాభావ సంబంధం ఉంది. కానీ, ఆ తరువాత ఢిల్లీకి చేరారు. ఆ నగరంతో అనుబంధం ఏర్పరచుకున్నారు. కానీ కష్టకాలంలో ఆయనను ఆ నగరం ఆదుకోలేకపోయింది. ఈ విషయాలు మనకు కలకాలం గుర్తుండిపోతాయి. చరిత్రలో సంఘటనల సంపుటి, రామాయణ్, మహాభారత్ పురాణాల గురించి ఆయనకు ఉన్న అభిప్రాయాలు, కర్బాలా యుద్ధం, సిక్కు మతస్థుల నమ్మకాలు, వారు నిర్వహించిన పోరాటాలు, ఏసుక్రీస్తు చివరిసారిగా తీసుకున్న ఆహారం, మున్షీ ప్రేమ్‌చంద్ కథ, 1857లో సిపాయిల తిరుగుబాటు, బ్రిటిష్ రాజ్యం చివరి రోజులు, హిట్లర్ పతనం, చార్లీ చాప్లిన్ హాస్యప్రియత్వం... ఇలా 80 సంవత్సరాల క్రితం ఆయన ప్రారంభించిన కళావైభవం కలకాలం గుర్తుండిపోతుంది. ఆయన ప్రతి సజీవ దృశ్యకావ్యం మన గుండెల్లో నిరంతరం పలుకుతుంది.

ఆయన చిత్రించిన ప్రతి కళాఖండం నిత్యం మనలను పలకరిస్తూనే ఉంటాయి. వాటిలోని రసమయ సృష్టి తమ సంకలన దార్శనికతను మనకు చవిచూపిస్తూనే ఉంటాయి. మానవుల పట్ల ఆయనకు గల అవ్యాజ్యమైన ప్రేమను, ఆయనలోని హాస్యచతురతను మనకు పంచుతూనే ఉంటాయి. ఆయన భావి కళాకారులకు మార్గదర్శిగా నిలుస్తారు. ఉన్నత స్థానాల్లో లభించే సహాయం కంటే కలిగే నష్టమే ఎక్కువన్న విషయం ఎంఎఫ్ హుస్సేన్ జీవితం మనకు బోధపరుస్తుంది. అధికారంలో ఉన్న వారి నుండి ఆయనకు ఎదురైన చేదు అనుభవాలు మనకు ఈ హెచ్చరిక చేస్తూనే ఉంటాయి. ★

టెన్షన్... టెన్షన్!

మానవ మెదళ్లు
హైటెన్షన్ కరంట్
తీగలవుతున్నాయ్!
నేడు 'టెన్షన్' పదం
అందరి నోటా విన్పిస్తోంది!
లింగవయోభేదం లేక
అందరినీ హడలగొడుతోంది!
'ఎల్‌కేజీ' వారి నుండి
'పీజీ'ల వరకు
చదువు పట్ల టెన్షన్!
పరీక్షలప్పుడూ టెన్షన్!
అటుపై ఉద్యోగం
రాలేదని టెన్షన్!
జాబ్ వచ్చాక
పని ఒత్తిడి టెన్షన్!
పెళ్లి కాలేదని టెన్షన్
పిల్లలు కలగలేదని టెన్షన్!
ఆటగాళ్లలోనూ
అమితమైన టెన్షన్!
ఆపరేషన్ చేయించుకునే
రోగికి బతుకుపై టెన్షన్!





బైటికెళ్లిన ఆడపిల్ల
తిరిగి ఇల్లు చేరుకునేదాక
పేరెంట్స్‌కి తప్పని టెన్షన్!
ఎన్నికలప్పుడు గెలుస్తామా
లేదాని అభ్యర్థుల టెన్షన్!
గెలిచాక పదవి లభిస్తుందో
లేదోనని టెన్షన్!
ఈ టెన్షన్ వ్యాధి
సర్వే సర్వత్రా వుంది!
ఈ పదానికి అనవసర... అధిక
ప్రచారం జరగడం దురదృష్టం!
ఓ టెన్షనూ! నీకో నమస్కారం!
అనుక్షణం మమ్ము
హడలగొట్టి రోగాల పాలు చేయకు!
అందరూ 'కూల్'గా ప్రశాంతంగా
ఉండేలా ఆశీర్వదించు!
నువ్వు మమ్ము వీడిపోకున్న
నీ పీక పిసికి చంపేసి
నిన్ను శాశ్వతంగ
దూరతీరాలకు తరిమేస్తాం!

- ఎస్.వివేకానంద

హైకూలు

ఆమె ఉనికి
మందార పూ చెరగు
అగ్గిపూ ధార

ఆమె వదనం
వెలుగుల శ్వసనం
హృది రంజనం

ఆమె హాసనం
హిరణ్మయ శ్వసనం
జ్యోతిరింగణం

ఆమె తలపు
విచ్చిన స్నేహ పుష్పం
లా విస్ఫారితం

ఆమె అడుగు
ఉత్తేజాన్నే ఒడ్డి
నింగినే తాకు.

- కాశీవఝుల రమానరసింహం

అలా వెళ్లిపోతావ్

కొన్ని కలయికలు సుదూరాలు పయనిస్తాయి
మరికొన్ని ఛేదించబడతాయి
అలా జీవిత చరమాంకంలోకి
వెన్నెల జాబిలిలా వచ్చావ్
తూకం వేయలేని అనుభవాల్ని
మార్గాల్ని నిర్దేశించావ్
రుతువుల్ని గోరింటాకు పెట్టుకుని
ఇంద్రధనస్సుల్ని మెరిపించావ్
చిరునవ్వుల సాక్షిగా
హృదయాన్ని ఆకాశానికి
తారాజువ్వలా ఎగిరించేశావ్
బతుకు గమనంలో
నడకల దిక్కుల్ని శాసించావ్
అంతరంగాన్ని ఆప్యాయత
దివిటీలతో వెలిగించావ్
అర్థం కాని సందర్భాల్నీ
సృష్టించావ్
వస్తావు ఎందుకనో ఏమిటనో
తెలియదు
రంగరిస్తావ్ తేనెపూలతో
జీవిత రంగవల్లుల్ని దిద్దిపోతావ్
తీరం వెంట సైకత శిల్పంలా



అందాల్ని సౌందర్య జ్ఞాపకాల్ని
నిర్మిస్తావ్ చెరిపేస్తావ్
హృదయాన్ని ధ్వంసం చేస్తావ్
ఏ పొద్దూ ఏ సంధ్యా
ఏ గాలీ ఏ వానా
మనం పంచుకున్న అనురాగాల్ని
తుడిచేయలేవ్
యాత్ర జీవితంలో
పంచుకున్న క్షణాలు
ఫొటో ప్రేములుగా మిగిలిపోతున్నాయ్

అనుకుంటాం
అన్నింటినీ కొలవాలని
కొన్ని అర్థం కావు
కొన్ని భాషకు అందవు
తీగలు లాగే అంతరంగాల
పరిభాషలో అర్థంకాని సందర్భాలు
మౌన తరంగాలవుతాయ్
రోదనలేని మనిషి ఉంటాడా
రోదన వేదిక మీద శిథిలమౌతున్నా...
సందిగ్ధ సమరంలో నన్ను వదిలి
కన్నీటితో వీణను మోగిస్తావ్
ఒక స్నేహబంధాన్ని తెంచుకుని
జీవిత బంధంలోకి జలజలా రాలే
కన్నీటి బొట్ల వెంట ఏడు అడుగులుగా
వెళ్లిపోతావ్
సంకెళ్లు పడ్డ స్వప్నానికి
చేరని తీరానికి
చెరగని జ్ఞాపకంలా వెళ్లిపోతావ్
అనుభూతుల్ని కన్నీటి బొట్లుగా చల్లిపోతావ్

- గవిడి శ్రీనివాస్

నవ్వుల్ - పువ్వుల్

ఎందరు?

సుబ్బయ్య : డాక్టర్‌గారూ! నాకు ఒకరు ఇద్దరుగా కనిపిస్తున్నారు. ఏదైనా చేయండి.
డాక్టర్ : (చికిత్స తర్వాత) ఇప్పుడు కళ్లు తెరిచి ఎంతమంది కనిపిస్తున్నారో చెప్పు?
సుబ్బయ్య : వామ్మో...అసలు ఎవరూ కనిపించడం లేదేంటి?!

వెరైటీ

విలేకరి : మీ సినిమాలో వెరైటీ కామెడీ సీన్ ఒకటి చెప్తారా?
నిర్మాత : భజగోవిందం పాత్ర నవ్వుతూ ఏడ్వడం, ఏడుస్తూ నవ్వడం చేస్తుంది.
విలేకరి : ఎందుకు?!
నిర్మాత : అతను 101 మంది అమ్మాయిల్ని ప్రేమిస్తాడు. ఏ ఒక్క అమ్మాయీ అతని ప్రేమకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వదు. చివరికి అతనికంటే వయసులో పెద్దామె అతని మెడలో పూలదండ వేస్తుంది.

యోగం

కాంతం : ఏంటి పిన్నిగారూ! మన చుట్టుపక్కల వాళ్లని డబ్బు అప్పు అడుగుతున్నారు?
పిన్నిగారు : త్వరలో అధిక ధనయోగం అని వారఫలాల్లో చదివాను.

జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

ఆదా



రాజేష్: ఏమోయ్! నీకో విషయం చెప్పాలి? హనీమూన్‌కి నేనొక్కణ్ణే వెళ్లి బోలెడంత డబ్బు ఆదా చేశా తెల్సా?
మనీష్: దానికే అంత మురిసిపోకు? మేం నీకంటే రెట్టింపు డబ్బు ఆదా చేశాం తెల్సా?
రాజేష్: ఎలా?
మనీష్: ఏముంది? మేమిద్దరం హనీమూన్‌కి వెళ్లలేదు. పక్కింటోళ్లు వెళ్తుంటే చూసి ఆనందించాం.

అదృష్టం

సూరి: అంటే... నీ అదృష్టం పక్కింటితో ముడిపడి వుందన్నమాట.
గిరి: అవున్రా బాబూ! వాళ్ల కుక్క తోబుట్టువే మా కుక్క.

ఎంత దూరం?

(టైటానిక్ మునిగిపోతోంది)
జాన్: ఏవండీ! ఇక్కడికి భూమి ఎంత దూరంలో వుంది?
రాబ్: ఆ ...ఎంతా ఒక కిలోమీటరు?
జాన్: (వెంటనే నీళ్లలోకి దూకి) ఏ దిక్కు వెళ్లాలి?
రాబ్: సరిగ్గా కిందికి వెళ్లు.

యాపిల్

(ఓ డాక్టరు, ప్రొఫెసరు ఒకే అమ్మాయిని ప్రేమిస్తారు)

డాక్టర్: ఏమయ్యా! మార్కెట్లో అన్ని రకాలుండగా రోజూ ఆ అమ్మాయికి యాపిల్ మాత్రమే ఇస్తావెందుకు?
ప్రొఫెసర్: యాపిల్ డాక్టర్ని దూరంగా వుంచుతుందని పెద్దలు చెప్తారు కదండీ. అందుకు.

కళ్యాణ ఘడియ

(ఇద్దరు ప్రేమికుల మధ్య సంభాషణ)

అమ్మాయి: ఇదే సరైన సమయం. మనం పెళ్లి చేసుకోడానికి.
అబ్బాయి: అవునవును. కానీ మనల్ని పెళ్లాడేదెవరు?

విశ్వాసం

యువకుడు: ఏవండీ! మీరు అమ్ముతున్న కుక్క విశ్వాసంగా వుంటుందా?
యజమాని: దానికి విశ్వాసం చాలా ఎక్కువండీ బాబూ!
యువకుడు: ఎలా చెప్పగలరు సార్?
యజమాని: దాన్ని ఇప్పటికి మూడు సార్లు అమ్మాన్లే.

మారాడా!

యోగా టీచర్: ఏమ్మా! యోగా నేర్చుకోవడం మొదలెట్టాక... మీ ఆయన తాగుడులో ఏదైనా మార్పు వచ్చిందా?
మహిళ: వచ్చింది సార్. తల కిందులుగా నిలబడి కూడా ఫుల్లు బాటిల్ కొడుతున్నాడు.

- కె.వీరేంద్ర, ఒమ్మెవరం, ప్రకాశం.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్



సాహిత్య రంగంలోనైనా, సినిమా రంగంలోనైనా అనువాదం ఓ అపురూపమైన ప్రయత్నం. ఒక ప్రాంతానికీ, ఒక భాషకూ చెందిన విషయాలనూ, విశేషాలనూ, ఆలోచనా ధోరణినీ మరొక ప్రాంతానికీ, భాషకూ అందించి, మానసిక పరిధిని విస్తరింపజేయడంలో అనువాదం పోషించే పాత్ర నిరుపమానం. అందుకే, ఎవరు ఏమనుకున్నా అనువాదం ఓ ప్రత్యేక కళ, దానిది ఓ ప్రత్యేక స్థానం. తెలుగు సినిమాకు సంబంధించి కూడా అనువాదాలకు చాలా చరిత్రే ఉంది. పరాయి భాష నుంచి తెలుగులోకి అనువాదమైన తొలి చిత్రం 'ఆహుతి' ఇప్పటికి సరిగ్గా 61 ఏళ్ళ క్రితం 1950 జూన్ 22న విడుదలైంది. ఆరు దశాబ్దాలు పూర్తయి, తెలుగు నాట డబ్బింగ్ కళకు షష్టిపూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం.

తెలుగులో అనువాద చిత్రాలకు అరవై ఏళ్ళు

ఇవాళ తెలుగు సినీ రంగం ఏటా ఉత్పత్తి చేస్తున్న చిత్రాల్లో ఒక్కో ఏడాది దాదాపు సగం దాకా అనువాద చిత్రాలే! అనువాద ప్రక్రియను అరువు తెచ్చుకున్న తొలి ఏడాదే రెండు డబ్బింగ్ చిత్రాల ('ఆహుతి', 'రాజా విక్రమ')తో శుభారంభం పలికిన తెలుగు చిత్రసీమలో ప్రస్తుతం ఏటా దాదాపు 100కు పైగా భారతీయ భాషా చిత్రాలు, హాలీవుడ్ చిత్రాలు తెలుగులోకి అనువాదమై, ప్రేక్షకుల ఎదుటకు వస్తున్నాయి. ('రాజా విక్రమ' చిత్రం పూర్తి స్థాయి డబ్బింగ్ కాదనీ, మాతృకలోని కన్నడ డైలాగుల్ని యథాతథంగా ఉంచి, మధ్య మధ్యలో తెలుగులో వ్యాఖ్యానం జోడించి, విడుదల చేసినట్లు గుర్తనీ విమర్శకులు వి.ఏ.కె. రంగారావు అన్నారు). దీన్నిబట్టి గత 60 ఏళ్ళలో డబ్బింగ్ ఎంత శక్తిమంతంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

తెలుగులో తొలి డబ్బింగ్ చిత్రం

తెలుగులో అనువాద చిత్రాలకు నవీనా ఫిలిమ్సు వారి 'ఆహుతి' (1950) నాంది పలికింది. 1946లో హిందీలో ఆర్.ఎస్. జున్నార్కర్ దర్శకత్వంలో రూపొందిన 'నీరా ఔర్ నందా' చిత్రం దీనికి మాతృక. 'నీరా ఔర్ నందా' హక్కులు కొనుక్కున్న వాసిరెడ్డి నారాయణరావు తెలుగులో 'ఆహుతి'గా నిర్మించారు. తెలుగు సినీ రంగానికి సరికొత్తదైన డబ్బింగ్ ప్రక్రియ అలా 'ఆహుతి'తో శ్రీకారం చుట్టుకుంది. ఈ అనువాద యజ్ఞంలో అప్పట్లో తెలుగు చిత్రసీమలో ప్రముఖులైన మహామహులందరూ పాల్గొనడం విశేషం. ప్రముఖ రచయిత శ్రీశ్రీ ఈ డబ్బింగ్ చిత్రానికి మాటలు, పాటలు సమకూర్చారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు సంగీత బాధ్యతలు నిర్వహించారు. పాటలు పాడిన వాళ్ళు కూడా ప్రసిద్ధులే! రావు బాలసరస్వతి, ఘంటసాల, కనకం నేపథ్యగానం చేశారు. చలనచిత్ర నిర్మాణ ప్రక్రియపై క్షుణ్ణంగా అవగాహన ఉన్న ప్రముఖ దర్శకుడు, విద్యావంతుడు ఎన్. జగన్నాథ్ (1936 నాటి 'ద్రౌపదీ మానసంరక్షణము' చిత్ర దర్శకుడు) ఈ తొలి తెలుగు డబ్బింగ్ చిత్ర నిర్వహణ సాగించారు.

తెర మీది పాత్రల పెదవుల కలయికకు తగ్గట్లుగా మాటలు చెబుతూ, తెర వెనుకే స్వరదాతలుగా వ్యవహరించిన వాళ్ళూ సుప్రసిద్ధులే! 'ఆహుతి' చిత్రం – "సంఘ క్షేమానికి బలియైన ప్రేమికుల కథ". అందులో కథానాయకుడి పాత్రకు ప్రముఖ రంగస్థల – సినీ నటుడు వల్లం నరసింహారావు గాత్రధారణ చేశారు. అలా ఆయన తెలుగులో డబ్బింగ్ కళలో తొలి హీరో అయ్యారు. ప్రముఖ గాయకుడు మాధవపెద్ది సత్యం విలన్ పాత్రకు డబ్బింగ్ చెప్పి, తొలి డబ్బింగ్ విలన్ అయ్యారు. తెలుగు తెరపై హాస్యరసపోషణకు పేరు తెచ్చుకున్న చదలవాడ కుటుంబరావు ఆ చిత్రంలో హాస్య పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

మన కన్నా ముందే తమిళనాట డబ్బింగ్‌లు

నిజానికి, తెలుగులో కన్నా ముందే తమిళ చిత్రసీమలో ఈ డబ్బింగ్ చిత్రాల ధోరణి మొదలైంది. పసుపులేటి కన్నాంబ తదితరులు నటిస్తున్న 'హరిశ్చంద్ర' తమిళ చిత్రానికి పోటీగా, ఏ.వి.ఎం. సంస్థ కన్నడ 'హరిశ్చంద్ర' చిత్రాన్ని డబ్ చేసిన ఘట్టం 1943లో జరిగింది. అలా తొలి తమిళ డబ్బింగ్ చిత్రం కన్నడంలో నుంచి తమిళానికి దిగుమతి అయింది. ఈ డబ్బింగ్ ప్రక్రియ ఆలోచన కూడా చాలా గమ్మత్తుగా వచ్చింది. అప్పట్లో ఏ.వి.ఎం. స్టూడియోలోనే వారి సొంత కన్నడ చిత్రం 'హరిశ్చంద్ర' (1943 జూన్ 4 విడుదల) నిర్మాణమవుతోంది. సృజనాత్మకత నిండిన నిపుణుడైన శబ్దగ్రాహకుడు వి.ఎస్. రాఘవన్ స్టూడియోలో పనిచేసేవారు. కన్నడ చిత్రం రీళ్ళను ప్రదర్శించుకొని చూస్తున్నప్పుడు ఆయనకు ఓ ఆలోచన తట్టింది. శబ్దం తాలూకు మీటను ఆపుచేసి, తెర మీద శబ్దం లేకుండా కనిపిస్తున్న దృశ్యానికి తగ్గట్లుగా తోచిన తమిళ మాటలు మాట్లాడి చూశారు. అప్పుడు తెర మీద కన్నడ సినిమా కాక, అచ్చం తమిళ సినిమా చూస్తున్నట్లే అనిపించింది. దాంతో, రాఘవన్ సూచన మేరకు ఉత్సాహం పొందిన ఏ.వి.ఎం. అధినేత ఏ.వి. మెయ్యప్పన్ ప్రయోగాత్మకంగా ఆ కన్నడ చిత్రం రీళ్ళు కొన్నిటిని తమిళంలోకి ప్రయోగాత్మకంగా 'తర్జుమా' చేసి చూశారు. ఫలితాలు అద్భుతంగా ఉండడంతో, పూర్తి సినిమాను తర్జుమా చేసి, 'హరిశ్చంద్ర' తమిళ అనువాదాన్ని (1944 జనవరి 6న) విడుదల చేశారు. ఈ సాహసోపేతమైన ప్రయోగం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైంది. ఈ తర్జుమా చిత్రాలే వాణిజ్య పరిభాషలో 'డబ్బింగ్ చిత్రాల' పేర ప్రాచుర్యం పొందాయి. అలా ఆడియోగ్రాఫర్ వి.ఎస్.రాఘవన్ ఆలోచన, నిర్మాత ఏ.వి.మెయ్యప్పన్ సాహసం కలసి దక్షిణాదిన డబ్బింగ్ ఫిల్మ్స్‌కు శ్రీకారం చుట్టాయి. అందుకే, ఏ.వి. మెయ్యప్పన్‌ను 'దక్షిణ భారతదేశంలో డబ్బింగ్ చిత్ర పరిశ్రమకు పితామహుడు'గా పేర్కొనవచ్చు.

అలాగే, తెలుగులోకి ఈ అనువాద ప్రక్రియ రాక ముందే, మన తెలుగు చిత్రాలు తమిళానికి తర్జుమా కావడం మొదలైంది. మీర్జాపురం రాజా వారు తమ 'శోభనాచల' పతాకంపై నిర్మించిన

తెలుగు జానపద చిత్రం 'కీలుగుర్రం' తెలుగులో ఘనవిజయం సాధించడమే కాక, వెంటనే తమిళంలోకి అనువాదమైంది. తమిళనాట 'మాయక్కుదిరై' (1949)గా విడుదలైన ఆ చిత్రం అక్కడా కాసులు కురిపించింది. ఫలితంగా, తెలుగు నుంచి తమిళానికి డబ్బింగైన తొలి చిత్రంగా 'కీలుగుర్రం' చరిత్రకెక్కింది.

అనువాద బ్రహ్మల అవిరళ కృషి

ఇవాళ ఇతర భాషల్లో నుంచి తెలుగులోకి డబ్బింగ్ చిత్రాల హవా అప్రతిహతంగా సాగడం చూస్తున్నాం. కానీ, తెలుగులోకి వచ్చిన తొలి అనువాద చిత్రం 'ఆహుతి' ఆర్థికంగా విఫలమైందన్నది ఆసక్తికరమైన సమాచారం. అయితే, అందులోని పాటలకు మాత్రం చాలా బాగున్నాయనే పేరు వచ్చింది. ముఖ్యంగా, 'ప్రేమయే జనన మరణలీలా...' అంటూ ఘంటసాల, రావు బాలసరస్వతీదేవి పాడిన పాట తరచూ రేడియోలో వినపడుతూ ఉండేది. 'ఆహుతి'లోని పాటలు బాగుండడానికి సాలూరు రాజేశ్వరరావు సంగీతం ఎంతో తోడ్పడింది. తాళం మాత్రం హిందీ మాతృక పాటల్లోనిదే పాటిస్తూ, బాణీలన్నిటినీ ఆయన పూర్తిగా మార్చివేశారు. అలా "పూర్తిగా మార్చి, తన సొంత ముద్ర వేశారు. కొన్ని సందర్భాల్లో ఒకే పాటకు మూడు, నాలుగు రకాలుగా ట్యూన్ చేసి, అందరికీ నచ్చినదాన్ని ఖాయం చేయడం కూడా రాజేశ్వరరావు ప్రత్యేకత" అని ఒక సందర్భంలో శ్రీశ్రీయే స్వయంగా చెప్పారు.

సినిమాకు పాటలు రాయడం ఏమంత సులభం కాదు. డబ్బింగుకు రాయడం మరీ కష్టం. పైగా, ఇటీవలి అనువాదాల్లో అయితే తెర మీది పాత్రల పెదాల కదలికను పట్టించుకోకుండా నడిచిపోతున్నాయి. కానీ, అప్పట్లో ట్యూన్‌కి మాత్రమే కాక, పెదాల కదలికకు కూడా సరిపోయేలా పాట రాయాల్సి ఉండేది కాబట్టి, డబ్బింగుకు రాయడం మరీ మరీ కష్టంగా ఉండేది. కానీ, శ్రీశ్రీ, అనిసెట్టి సుబ్బారావు, ఆరుద్ర లాంటి అనేకులు ఆ కలం మీద సాములో ప్రవీణులుగా నిలిచారు. ఆ తరువాత రాజశ్రీ (అసలు పేరు ఇందుకూరి రామకృష్ణంరాజు) , వసంతకుమార్, ఇవాళ శ్రీరామకృష్ణ, వెన్నెలకంటి – ఆయన కుమారుడు శశాంక్ వెన్నెలకంటి, రాజశ్రీ కుమారుడు రాజశ్రీ సుధాకర్ – ఇలా ఎంతోమంది రచయితలు ఈ అనువాద ప్రక్రియకు కొత్త మెరుగులు దిద్దారు. వెలుగులు అద్దారు. గడచిన అరవై ఏళ్ళ తెలుగు అనువాద ప్రక్రియా కాలంలో దాదాపు 65 నుంచి 80 మంది దాకా డబ్బింగ్ రచయితలు ఈ రంగానికి వచ్చినట్లు ఓ లెక్క.

వాచికాభినయంతో వెండితెరపై ప్రాణప్రతిష్ఠ

తెర మీద బొమ్మలను చూస్తూ, పెదాల కదలికకు తగ్గట్టుగా మాటలు పలికి, పాత్రకు ప్రాణం పోసే స్వరదాన వృత్తిలో కూడా చాలామందే తమ వంతు సేవలు అందించారు. సీనియర్ నటులు పి.జె. శర్మ, కాకరాల దగ్గర నుంచి ఇవాళ్టి ప్రముఖ తారలు రాజేంద్రప్రసాద్, సాయికుమార్ దాకా అందరూ విస్తారంగా డబ్బింగ్‌లు చెప్పినవారే! ప్రముఖ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు సైతం ఒకప్పుడు డబ్బింగ్‌లతో జీవనం గడిపిన రోజులున్నాయంటే ఇవాళ ఆశ్చర్యం కలుగుతుంది.

'వీర పాండ్య కట్టబ్రహ్మన'గా శివాజీ గణేశన్ తెలుగు నాట సంచలనం రేపారంటే, తన గొంతుతో ఆ పాత్రకు జీవం పోసిన ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కె.వి.ఎస్. శర్మ (కలపటపు వెంకట సుబ్బరాయ శర్మ) వాచికాభినయాన్ని విస్మరించలేం. అలాగే, అనేక తెలుగు చిత్రాల్లో శివాజీ గణేశన్ తెరపై కనిపించినా, మనకు వినిపించేది, ఆయన అభినయానికి తెలుగులో ఊపు తెచ్చింది ప్రసిద్ధ నటుడు కొంగర జగ్గయ్య కంఠస్వరమే. 1940ల నుంచి సినీ రంగంలో ఉన్న టి.జి. కమలాదేవి లాంటి ఆ తరం నటీమణులు ఎందరో డబ్బింగ్‌ను సైతం ఓ పవిత్రమైన వృత్తిగా భావించి, నిష్ఠగా స్వరదానం చేశారు. ఇవాళ్టికీ నటన, డబ్బింగ్‌లతో క్రియాశీలంగా ఉన్న తరువాతి తరం గుణచిత్ర నటి జానకి ఈ డబ్బింగ్‌ల పుణ్యమా అని ఏకంగా 'డబ్బింగ్' జానకిగా ప్రసిద్ధులయ్యారు. ఇక, ప్రముఖ తమిళ హీరో కమలహాసన్‌కు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, రజనీకాంత్‌కు మరో గాయకుడు మనో అచ్చంగా అతికినట్లు చెప్పే డబ్బింగ్ ఎలాంటిదో మొన్నటి 'దశావతారం' (2008), నిన్నటి 'రోబో' (2010) ప్రత్యక్ష సాక్ష్యాలు.

అనువాదాలకు స్వర్ణయుగం

అనువాదాల హవా ఎంత దాకా వెళ్ళిందంటే, సంఖ్యాపరంగా నేరు తెలుగు చిత్రాలకు దీటుగా డబ్బింగ్ చిత్రాలూ విడుదలవడం కొన్నేళ్ళు సంభవించింది. "1980 నుంచి 1990 మధ్యకాలం ఇటు తెలుగులోనూ, అటు తమిళంలోనూ డబ్బింగ్ చిత్రాలకు స్వర్ణయుగం. ఆ కాలంలో కొన్నేళ్ళు నేరు చిత్రాల సంఖ్యతో, అనువాద చిత్రాల సంఖ్య పోటీ పడింది" అని ఇప్పటికి పాతికేళ్ళ పైగా డబ్బింగ్ కళలో స్థిరంగా కొనసాగుతున్న ఘంటసాల రత్నకుమార్ (గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఆఖరి కుమారుడు) చెప్పారు.

"డబ్బింగ్ చిత్రాల పుణ్యమా అని ఎందరో దర్శకులు, నటీనటులు తమ పరిధిని పక్క ప్రాంతాలకూ, భాషలకూ విస్తరించుకోగలిగారు. ఆ ప్రాచుర్యం ఫలితంగా వాళ్ళలో కొందరు అటు పైన నేరు తెలుగు చిత్రాలకు దర్శకులుగా, హీరోలుగా వెలుగొందారు" అని రత్నకుమార్ వివరించారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, సంస్కృత డబ్బింగ్‌లతో మొత్తం 1080 చిత్రాలకు స్వరదానం చేసిన అరుదైన రికార్డు ఘంటసాల రత్నకుమార్‌ది. ఆడవాళ్ళలో దుర్గ, గౌరీప్రియ లాంటివాళ్ళు తెలుగు, తమిళ భాషలు రెంటిలోనూ డబ్బింగ్‌లు చెప్పి, ఆశ్చర్యకరమైన ప్రతిభ చూపారు.

తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చేసినా, ఇప్పటికీ పరాయి భాషల నుంచి తెలుగుకూ, తెలుగు నుంచి ఇతర భాషలకూ డబ్బింగ్‌లకు చెన్నై కేంద్రస్థానంగా కొనసాగుతోంది. మరోపక్క తెలుగు మాట్లాడడం రాని హీరోలు, పరభాషా హీరోయిన్లు, విలన్ల పుణ్యమా అని నేరు తెలుగు చిత్రాలకు సైతం స్వరదాతలు అవసరమై, హైదరాబాద్‌లోనూ సమాంతరంగా డబ్బింగ్ కళాకారులు పెరిగారు. 'సౌతిండియన్ టీవీ, సినీ ఆర్టిస్ట్ అండ్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్' చెన్నైలో చాలా ఏళ్ళుగా ఉంటే, కొన్నేళ్ళ క్రితం హైదరాబాద్‌లో ఏర్పడిన 'ఆంధ్రప్రదేశ్ మూవీ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్' సైతం అనతికాలంలోనే పెద్ద గుర్తింపు తెచ్చుకుంది.

గుర్తింపు, గౌరవం అంతంత మాత్రమే!

అయితే, ఎంతో కష్టం, శ్రమ దాగి ఉన్న ఈ డబ్బింగ్ సినీ ప్రక్రియకు ఇవాళ్టికీ మన చలనచిత్ర పరిశ్రమలో తగినంత గౌరవం, గుర్తింపు రాలేదన్నది నిష్ఠుర సత్యం. అనేక అభ్యర్థనల అనంతరం స్వరదాతలైన అనువాద కళాకారులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొద్దిపాటి దయ చూపింది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే నంది అవార్డుల్లో 1996 నుంచి ఉత్తమ డబ్బింగ్ కళాకారుడు, కళాకారిణులకు సైతం అవార్డులను అందించడం మొదలుపెట్టింది. కానీ, డబ్బింగ్ రచయితకు మాత్రం ఆ పాటి గౌరవం కూడా ఇప్పటికీ లేదు.

అయితే, డబ్బింగ్ కళకు ప్రాచుర్యం, దాని ద్వారా వినోద పరిశ్రమలో వ్యాపారం మాత్రం విపరీతంగా పెరిగాయి. పెరిగిన టీవీ ఛానళ్ళు, అనువాద ధారావాహికలు, 'యానిమల్ ప్లానెట్' లాంటి ఛానళ్ళ కార్యక్రమాలు ప్రాంతీయ భాషల్లోనూ అందుబాటులోకి తేవడంతో ఇవాళ అనువాద రచయితలు, కళాకారులు ఇబ్బడి ముబ్బడి అయ్యారు. అలాగే, హాళ్ళలో విడుదల కాకుండా, కేవలం ఉపగ్రహ టీవీ ఛానల్ ప్రసారాలకూ, డి.వి.డి. విడుదలలకు మాత్రమే పనికొచ్చేలా బోలెడన్ని సినిమాల అనువాదం సాగుతోంది. "వీటన్నిటి వల్ల ఇవాళ ప్రతి ఒక్కరూ డబ్బింగ్ రచయిత, డబ్బింగ్ కళాకారుడూ అయిపోయారు" అని రత్నకుమార్ నవ్వేశారు. ఇవాళ చెన్నైలో దాదాపు 60 మంది, మిగిలిన హైదరాబాద్ డబ్బింగ్ కళాకారులు కలిపి దాదాపు 150 మంది వరకు స్త్రీ పురుషులు ఈ స్వరదాన ప్రక్రియనే ప్రధాన వృత్తిగా చేసుకొని జీవిస్తున్నట్లు ఓ అంచనా. మొత్తం మీద, ప్రేక్షకులకు వినోదం అందించడంతో పాటు పరిశ్రమకు ప్రత్యేక ఆదాయంగానూ మారిన అనువాద ప్రక్రియ భవిష్యత్తులో మరిన్ని సంచలనాలకు కేంద్రం కావడం ఖాయమనే అనిపిస్తోంది.

- రెంటాల జూనియర్



కంప్యూటర్లలో పరిచయమున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో పాస్‌వర్డ్స్‌ను ఉపయోగిస్తూనే వుంటారు. ఇమెయిల్, చాటింగ్, బ్రౌజింగ్, నెట్‌వర్కింగ్, ఎటిఎం బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్... తదితర ఆన్‌లైన్ సేవలు వాడుకలోకి వస్తుండడంతో పాస్‌వర్డ్‌ల ప్రాముఖ్యత పెరుగుతోంది. అనుమతి లేకుండా ఇతరుల కంప్యూటర్లలోకి చొరబడి డేటాను తస్కరించడాన్ని నివారించేందుకు, ఇమెయిల్ అకౌంట్స్‌ను, వెబ్‌సైట్ల హ్యాకింగ్‌ను నిరోధించేందుకు పాస్‌వర్డ్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. ఇంటికి తాళం ఎంత ముఖ్యమో, ఆన్‌లైన్ సర్వీసులకు పాస్‌వర్డ్ కూడా అంతే ముఖ్యం.

పాస్‌వర్డ్ పదనిసలు

ఇమెయిల్ అకౌంట్లను, ఏదోఒక వెబ్‌సైట్ ద్వారా ఓపెన్ చేసుకుంటే అక్కడ పాస్‌వర్డ్ తప్పనిసరిగా వుండాలి. కంప్యూటర్లను ఉపయోగించే వారిలో అనేకమంది ఒకటి అంతకంటే ఎక్కువ పాస్‌వర్డ్స్‌ను ఉపయోగిస్తూనే వుంటారు. సరైన పాస్‌వర్డ్స్‌ను క్రియేట్ చేసుకోవడం, వాటిని గుర్తుపెట్టుకోవడం తప్పనిసరి. హ్యాకర్స్ నుంచి పొంచివున్న ముప్పు కారణంగా సులువుగా పాస్‌వర్డ్స్ ఇతరులు తెలుసుకోగలరు. ఈ పాస్‌వర్డ్స్‌ను హ్యాకర్స్ సులువుగా తెలుసుకోకుండా వుండే విధంగా మనకు గుర్తుండే విధంగా కఠినతరమైన పాస్‌వర్డ్స్‌ను తయారు చేసుకోవాలి. చాలామంది తమ పేరునే పాస్‌వర్డ్‌గా వాడుతుంటారు. ఇది అంత సురక్షితం కాదంటున్నారు నిపుణులు. కేవలం Lowercase అక్షరాలతో పెట్టుకున్న మీ పాస్‌వర్డ్‌ను తెలుసుకోడానికి హ్యాకర్లకు 10 నిమిషాలే పడుతుందట. అదే పాస్‌వర్డ్‌ని Uppercase అక్షరాల్లో పెడితే కనుక్కోవడానికి 10 గంటలు పడుతుందని చెబుతున్నారు. అంకెల్ని, గుర్తుల్ని కూడా పాస్‌వర్డ్‌లో పెడితే తెలుసుకోవడానికి హ్యాకర్ కంప్యూటర్‌కి సుమారు 18 రోజులు పడుతుందట. "డైలీ మెయిల్" నివేదిక ప్రకారం సుమారు 50 శాతం మంది నెటిజెన్లు ఒకే రకమైన పాస్‌వర్డ్‌లు వాడుతున్నారు. చాలామంది 123456, Password, 12345678, qwerty, abc123 లనే వాడుతున్నారని తెలుసా? నిపుణుల సలహా ఏంటంటే పాస్‌వర్డ్ కచ్చితంగా 9అంకెల కంటే తక్కువ ఉండకూడదు. అక్షరాలతో పాటు నెంబర్లు, గుర్తుల్ని జత చేయాలి. అప్పుడు పాస్‌వర్డ్‌ని బ్రేక్ చేయడానికి హ్యాకర్‌కి 44,530 సంవత్సరాలు పడుతుందని ఆ నివేదిక సారాంశం.

పాస్‌వార్డ్ గుర్తుండాలంటే...

మెయిల్ ఓపెన్ చేసేటప్పుడు చాలా మంది ఎవ్వరూ కనుక్కోలేని విధంగా పాస్‌వర్డ్ ఇవ్వాలని పప్పులో కాలేస్తుంటారు. ఒక్కోసారి పాస్‌వర్డ్ గుర్తురాక నానాతంటాలు పడాల్సివస్తుంది. ఇలాంటి సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే... పాస్‌వర్డ్ ఇచ్చేటప్పుడు వాళ్ళ కారు నెంబర్లు, లేదా బైక్ నెంబర్లతో వారికి ఇష్టమైన పువ్వుల నెంబర్లు మిళితం చేసి ఇవ్వవచ్చు.

ఉదా: మీ కారు నెంబర్ AP04 అనుకోండి. మీకిష్టమైన పువ్వు లిల్లీ (lily) అనుకోండి. అప్పుడు మీ పాస్‌వర్డ్ నెంబర్ alpi0l4y ఇవ్వవచ్చు. అదేవిధంగా మీరు Pinky అని పాస్‌వర్డ్ ఇవ్వాలనుకుంటే, ఇందులో ఒకటి బిగ్‌లెటర్, ఒకటి స్మాల్ లెటర్ కూడా ఇవ్వవచ్చు. అప్పుడు PiNkY ఈ విధంగా అన్నమాట. లేదా ఒక పదాన్ని కుదించి ఇచ్చుకోవచ్చు. అదెలాగంటే... 'Handy for you' అని ఇవ్వాలనుకుంటే 'hAnDy4U' అని ఇవ్వొచ్చు.

అంతేకాకుండా పాస్‌వర్డ్‌ను ఆరు నెలలకోసారి మార్చుకోవడం మంచిదని నిపుణులు చెపుతున్నారు. ఒకటికంటే ఎక్కువ పాస్‌వర్డ్స్ వున్నప్పుడు గుర్తుపెట్టుకోవడం కష్టం అనుకుంటే పాకెట్ డైరీలో నోట్ చేసుకోవడం మంచిది.

గుర్తుంచుకోవలసిన అంశాలు:

➽ పాస్‌వర్డ్ అన్నది సింపుల్‌గా ఉండకూడదు. చాలామంది పాస్‌వర్డ్‌గా వారి పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేర్లు పెట్టుకుంటారు. ఇది సరైంది కాదు. తెలిసిన వారి ఊహకందే విధంగా పాస్‌వర్డ్ ఉండకూడదు. కనీసం 9 నుండి 14 క్యారెక్టర్లు ఉండాలి. పాస్‌వర్డ్‌లో ఒక అంకె, ఒక స్పెషల్ క్యారెక్టర్, ఒక క్యాపిటల్ లెటర్, ఒక స్మాల్ లెటర్ ఉండాలి.

➽ పాస్‌వర్డ్ ఎంటర్ చేసే చోట కీ లాగర్స్ ఉన్నాయేమో చూసుకోవాలి, ఒకవేళ ఉన్నట్లయితే అవి మీ పాస్‌వర్డ్‌ను పట్టేస్తాయి. అవి ఉన్నచోట పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయకూడదు. ముఖ్యంగా ఇంటర్నెట్ కేఫ్‌లలో ఇటువంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

➽ మీరు పాస్‌వర్డ్ ఎంటర్ చేసే వెబ్సైటు నిజమైనదా లేక నకిలీదా అన్న సంగతి కూడా పరిశీలించుకోవాలి. మీరు పాస్‌వర్డ్ ఎంటర్ చేసే ముందు ఎస్ .ఎస్. ఎల్. (SSL) సర్టిఫికేట్ (లాగ్ సింబల్‌లో) ఉందో లేదో సరి చూసుకోవాలి. అది హెచ్.టి. టి.పి.ఎస్. (https://) కనెక్షన్ అయితే మంచిది. దాదాపు అన్ని మెయిల్ సర్వీసులు (జిమెయిల్, యాహూ, హాట్‌మెయిల్) హెచ్.టి.పి.ఎస్. నే వాడుతున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా యూ.ఆర్.ఎల్. సరైనదీ కానిదీ చూసుకోవాలి.

➽ యూజర్‌నేమ్‌లకు, పాస్‌వర్డ్‌లకు నిక్‌నేమ్స్, డేట్ ఆఫ్ బర్త్, పెట్నేమ్స్‌ను పాస్‌వర్డ్‌గా పెట్టుకోకూడదు. కొందరు రెడిఫ్, యాహూ, జిమెయిల్‌కు ఒకే యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను ఉపయోగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఒకదాని పాస్‌వర్డ్ తెలిస్తే అన్ని అకౌంట్లలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుంది.

➽ పాస్‌వర్డ్ ప్రతిసారీ టైప్ చెయ్యటమెందుకులే అని బద్ధకించి కంప్యూటర్‌కి పాస్‌వర్డ్ గుర్తుంచుకోమన్న ఆదేశాన్ని ఇస్తారు. పర్సనల్ కంప్యూటర్లకి మినహా ఇది ఇంకెక్కడా అంత శ్రేయస్కరం కాదు.

➽ పాస్‌వర్డ్ చిన్నగా ఉంటే సులభంగా గెస్ చేయడానికి ఆస్కారం ఉంటుంది. కాబట్టి పాస్‌వర్డ్ వీలైనంత పొడవుగా ఉండేలా చూసుకోవాలి. క్యారెక్టర్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, పాస్‌వర్డ్‌లో అప్పర్‌కేస్, లోయర్‌కేస్ అక్షరాలు మిళితమై ఉండేలా జాగ్రత్త పడటం, అంకెలు, సింబల్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

➽ ఇంగ్లీషు డిక్షనరీలోని పదాలను, 12345678 అంకెలను, abcdef, qwert, asdf, ZXCV..లను వరుస క్రమంలో ఉపయోగించడం అసలు మంచిది కాదు. సొంత ఊరి పేరు, పిల్లల పేర్లు, ఇంటిపేర్లు, ఉపయోగిస్తే ఇతరులు సులువుగా గుర్తించడానికి ఆస్కారం వుంటుంది. కాబట్టి ఆ అవకాశం ఇవ్వకూడదు.

- కె.ఎక్స్. రాజు

జీరా రైస్



కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో
జీలకర్ర - 2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయ - 1, కొత్తిమీర - 1 కట్ట
నూనె/నెయ్యి - 3 టేబుల్ స్పూన్లు
ఉప్పు - సరిపడా
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం



బియ్యం కడిగి పావుగంట నానబెట్టాలి. మందపాటి పాత్రలో నూనె వేసి వేడి చెయ్యాలి. జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. అందులోనే నానబెట్టిన బియ్యం వేసి ఒక నిమిషం వేయించాలి. తర్వాత బియ్యం కొలతకి రెట్టింపు అంటే లీటరు నీళ్లు పోసి, ఉప్పు వేసి ఉడికించాలి. పొంగు వచ్చాక కొత్తిమీర వేసి కలపాలి. మంట సిమ్‌లో పెట్టి ఐదు నిమిషాలు ఉడకనిస్తే చాలు. జీరా రైస్ రెడీ. వేడి వేడిగా తింటే చాలా బాగుంటుంది.

టమాటా రైస్

కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో
జీలకర్ర - 1 టేబుల్ స్పూన్
ఆవాలు - 1 టీ స్పూన్
ఉల్లిపాయ - 1
టమాటా ముక్కలు - 2 కప్పులు
కరివేపాకు - 4 రెమ్మలు
పచ్చిమిర్చి - 4
గరం మసాలా - అర టీస్పూన్
కారం - అర టీస్పూన్
కొత్తిమీర - 1 కట్ట
పసుపు - చిటికెడు
నూనె - పావుకప్పు
ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

బియ్యం కడిగి నానబెట్టాలి. మందపాటి పాత్రలో నూనెవేసి కాగనివ్వాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి వేయించాలి. తర్వాత టమాటా ముక్కలు, గరం మసాలా, పసుపు వేసి రెండు నిమిషాలు వేయించాలి. బియ్యం వేసి మరో నిమిషం వేయించాలి. లీటరు నీళ్లు, ఉప్పు, కారం వేసి ఉడికించాలి. అన్నం మూడొంతులు ఉడికాక కొత్తిమీర కలిపి మంట సిమ్‌లో పెట్టాలి. రెండు మూడు నిమిషాలు ఉడకనివ్వాలి. అంతే రుచికరమైన టమాటా రైస్ రెడీ.

రొయ్యల పులావ్

కావలసిన పదార్థాలు

బియ్యం - 2 కప్పులు
రొయ్యలు - 1 కప్పు
ఉల్లిపాయ - 1
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్
కారం - 1 స్పూన్
గరం మసాలా - 1 స్పూన్
పసుపు - చిటికెడు
కొత్తిమీర - కొద్దిగా
ఉప్పు - తగినంత
నూనె - 2 స్పూన్లు
మసాలా దినుసులు (యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి, పులావ్ ఆకు) - అన్నీ కొద్దికొద్దిగా

తయారు చేసే విధానం

రొయ్యలకు ఉప్పు, కారం, పసుపు, గరం మసాలా కలిపి పెట్టుకోవాలి. బాండీలో నూనె కాగాక మసాలా దినుసులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లిపాయ ముక్కలు వరుసగా వేయించాలి. అందులోనే రొయ్యలు, కడిగిన బియ్యం వేసి ఐదు నిమిషాలు వేయించాలి. తర్వాత నాలుగు కప్పుల నీళ్లు పోసి సన్నటి మంటపై ఉడికించాలి. దించే ముందు కొత్తిమీర చల్లుకుంటే ఘుమఘుమలాడే రొయ్యల పులావ్ రెడీ.

పుదీనా రాజ్మా బిర్యానీ

కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో
పుదీనా - 2 కట్టలు
రాజ్మా గింజలు - 100 గ్రా
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయ - 1
పచ్చిమిర్చి - 4
నూనె - 2 టేబుల్ స్పూన్లు
నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు
లవంగాలు - 4
దాల్చిన చెక్క - చిన్న ముక్కలు నాలుగు
ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందురోజు రాత్రే రాజ్మా గింజల్ని నానబెట్టాలి. బియ్యాన్ని కడిగి నానబెట్టాలి. పుదీనా ఆకుల్ని కడిగి మెత్తగా నూరాలి. వెడల్పాటి గిన్నెలో నూనె, నెయ్యి వేసి కాగనివ్వాలి. అందులో లవంగాలు, దాల్చిన చెక్క, ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, రాజ్మా గింజలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వరుసగా వేసి వేయించాలి. తర్వాత పుదీనా పేస్ట్ వేసి దోరగా వేయించి లీటర్ నీళ్లు పోసి ఉప్పు వేయాలి. నీళ్లు మరిగాక కడిగిన బియ్యం వేసి ఉడకనివ్వాలి. అంతే పుదీనా రాజ్మా బిర్యానీ రెడీ.

పెసర పునుకుల బిర్యానీ

కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో
పెసరపప్పు - పావుకిలో
యాలకులు - 4
లవంగాలు - 5
దాల్చిన చెక్క - 2 ముక్కలు
బిర్యానీ ఆకులు - 2
షాజీరా - 1 స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 స్పూన్లు
ఉల్లిపాయ - 1
పచ్చిమిర్చి - 5
కొత్తిమీర - 1 కట్ట
పుదీనా - 1 కట్ట
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - సరిపడా

తయారు చేసే విధానం



పెసరపప్పు రెండు గంటలు నానబెట్టాలి. తగినంత ఉప్పు వేసి కొంచెం బరకగా రుబ్బుకోవాలి. బాండీలో నూనెపోసి కాగనివ్వాలి. అందులో రుబ్బుకున్న పెసర పిండిని చిన్న చిన్న పునుకుల్లా వేసుకుని వేయించాలి. బియ్యాన్ని కడిగి పది నిమిషాలు నాననివ్వాలి. మందపాటి గిన్నెలో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి కాగనివ్వాలి. అందులో లవంగాలు, షాజీరా, యాలకులు, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి దోరగా వేయించుకోవాలి. అందులో పుదీనా, నానబెట్టుకున్న బియ్యాన్ని వేసి రెండు నిమిషాలు వేయించాలి. లీటరు నీళ్లు పోసి, సరిపడా ఉప్పువేసి ఉడకనివ్వాలి. అన్నం సగం ఉడికాక వేయించుకున్న పునుకులు, కొత్తిమీర కలిపి మూతపెట్టి సన్నటి సెగపై పావుగంట ఉడకనివ్వాలి. అంతే పెసరపునుకుల బిర్యానీ రెడీ. ★

చూద్దామా

అందమైన ఆకాశహర్మ్యాలు, ముచ్చటైన చిన్న చిన్న నదులు ఈ నగరం సొంతం. సముద్రం ఒడ్డున ఉండడం వల్ల బీచ్‌లకైతే లెక్కేలేదు. షాపింగ్ ప్రియులు ఎంతో ఇష్టపడే మాల్స్ ఎన్నో ఇక్కడున్నాయి. అన్నింటినీ మించి వెంకటేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. ఇక బౌద్ధాలయాల సంగతి సరేసరి. ఇదే ఆస్ట్రేలియాలోని అతి పురాతన నగరం... సిడ్నీ ఈవారం సిడ్నీ అందాలు చూద్దామా!



ఒపెరా హౌస్...

అందాల సిడ్నీ

ఆస్ట్రేలియాకు ఆగ్నేయ దిశలో పసిఫిక్ మహా సముద్ర తీరాన ఉందీ నగరం. దేశంలో పెద్ద నగరం కూడా ఇదే. ఇక్కడ లెక్కలేనన్ని పార్కులున్నాయి. ఆ నగర ప్రజల గురించి చెప్పుకోవాలంటే... వారికి రెండు ప్రత్యేకతలున్నాయి. అవేంటంటే... ఎవరి పని వారు చేసుకోవడం, పర్యాటకులకు సాయం చేయడం సిడ్నీవాసుల నైజం.

సుమారు 50 వేల ఏళ్ల క్రితం ఆదిమ మానవులు ఆగ్నేయాసియా నుండి ఆస్ట్రేలియా వచ్చి స్థిరపడ్డారని చెపుతారు. వారు పోలికల్లో భారతీయుల్లా వుండేవారట. ఆంగ్లేయులు సామ్రాజ్య విస్తరణలో అక్కడున్న చాలామంది ఆదివాసీలను చంపేశారు. అప్పుడు మిగిలిన సంతతే ప్రస్తుతం ఆస్ట్రేలియా అడవుల్లో నివసిస్తున్నారు. వారిలో కొంతమంది పట్టణాల్లో బిచ్చమెత్తుకుంటూ కనిపిస్తారు కూడా.

వాతావరణం

ఇక్కడ జనవరి నుండి వర్షాకాలం. అత్యధిక ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ మాత్రమే. మే నుండి ఆగస్టు వరకు చలికాలం. సెప్టెంబర్ నుండి వేసవికాలం. అయితే మార్చి నుండి మే నెల వరకు పర్యాటకులకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. అప్పుడైతే చాలా ఉత్సవాలు జరుగుతాయక్కడ.

ఇక్కడ కంగారూ మాంసంతో చేసిన వంటకాలు ప్రత్యేకం. మరొక విషయం ఏంటంటే మాంసాహారులకు బోలెడు వెరైటీలు అందుబాటులో ఉంటాయి. శాకాహారులకు మాత్రం చాలా తక్కువ వంటకాలు లభిస్తాయి.

సిడ్నీలో రెండు ప్రధానమైన పర్యాటక ప్రదేశాలున్నాయి. ఒకటి ఒపెరా హౌస్, రెండోది హార్బర్ బ్రిడ్జ్.

ఒపెరా హౌస్...

నదిలో 550 పలకలపై దీన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి సుమారు 300 కోట్ల డాలర్లు ఖర్చుపెట్టి, 14 సంవత్సరాల పాటు కట్టారట. దీన్ని చూడ్డానికొచ్చే పర్యాటకులతో ఈ ప్రాంతం ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రపంచంలోకెల్లా గొప్పగొప్ప కళాకారులిచ్చే బ్యాలే, ఒపెరా సంగీత ప్రదర్శనలు నిత్యం ఇందులో జరుగుతుంటాయి.

హార్బర్ బ్రిడ్జి

ఉత్తర దక్షిణ సిడ్నీలకు మధ్య వారధి ఈ బ్రిడ్జి. దీని పొడవు1149 మీటర్లు. ప్రపంచంలోనే పొడవైన స్టీల్ ఆర్చ్‌బ్రిడ్జి ఇది. అర్ధ చంద్రాకారంలో కనిపించే ఈ నిర్మాణానికి సుమారు 53 వేల టన్నుల స్టీలుని వినియోగించారట.

దీనిపైకి ఎక్కాలంటే చాలా ధైర్యముండాలి. ధైర్యం సంగతి తర్వాత! బ్రిడ్జి ఎక్కాలంటే టిక్కెట్ కొనాలి. దాని ధర ఎంతో తెలుసా? సింపుల్‌గా 180 డాలర్లు. ఈ బ్రిడ్జి కింద చాలా మంది ఆదివాసీలు కనిపిస్తారు. పర్యాటకులు సరదాగా వాళ్లతో ఫొటోలు కూడా దిగుతారు.

వావ్... ఎన్ని బీచ్‌లో!

సిడ్నీలో చూడాల్సిన మరో ముఖ్యమైన ప్రదేశం మ్యాన్స్ బీచ్. ఇది హార్బర్ బ్రిడ్జికి ఒక వైపు ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఫెర్రీలు తిరుగుతుంటాయి. ఆదివాసులుండే ప్రదేశానికి వెళ్లాలంటే వీటిలోనే వెళ్లాలి. మంగళ, శనివారాల్లో మాత్రమే అక్కడికి వెళ్లడానికి వీలవుతుంది. అక్కడైతే వారి జీవన విధానాన్ని చాలా దగ్గరగా చూడొచ్చు. ఇక్కడ మన మక్కా మసీదులోలాగే బోలెడు పావురాలు కనిపిస్తాయి. షాపింగ్ చేయాలనుకునేవారికి ఈ బీచ్ తీరంలో లెక్కలేనన్ని

స్టాన్లీ బీచ్

హార్బర్ బ్రిడ్జి



షాపింగ్ మాల్స్ కూడా ఉన్నాయి.

స్టాన్లీ బీచ్‌కి వెళ్లే రోడ్డు ప్రయాణం ఓ అడ్వంచర్‌లా వుంటుంది. ఈ బీచ్ ఒడ్డు నిటారుగా 70 అడుగుల లోతు ఉంటుంది. ఏ కొంచెం అదుపు తప్పినా లోయలో పడిపోవాల్సిందే. చాలా ప్రమాదకరమైన ప్రయాణం ఇది. అక్కడ్నుండి తూర్పువైపు కనుచూపు మేర ఎంత దూరం చూసినా సముద్రమే. అదే దక్షిణం వైపు చూశామనుకోండి.... కొండలు...వాటి అంచున చూడముచ్చటైన కాలనీలున్నాయి. వేసవిలో ఈ దేశస్థులు సముద్రం వెంబడి గ్లైడింగ్ విన్యాసాలు చేస్తారట.

పెద్ద మార్కెట్

సిడ్నీలో చెప్పుకోదగిన మరో ప్రదేశం వెస్ట్‌ఫీల్డ్ మార్కెట్. ఇది చాలా పెద్దది. గుండు సూది మొదలుకొని పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు అన్నీ దొరుకుతాయి. 10 ఎకరాల స్థలంలో 54 అంతస్తులుగా కట్టారు దీన్ని. కార్లు నిలపడానికే మూడు అంతస్తులున్నాయి.

నేషనల్ పార్క్

చూడాల్సిన మరో ప్రదేశం హెలెన్‌బర్గ్ నేషనల్ పార్కు. ఇందులో వెంకటేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. దీని విస్తీర్ణమే 10 ఎకరాలు. ఇందులోనే వరసిద్ధి వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చంద్రకాళీశ్వరునికి కూడా ఆలయాలున్నాయి. విశేషమేమంటే ఇక్కడి అర్చకులు తెలుగు, తమిళం చక్కగా మాట్లాడతారు.

ఈ పార్కుకు వెళ్లే దారిలో దట్టమైన అడవి ఉంది. మామూలుగా అడవంటే ఎత్తుపల్లాలుంటాయి. కానీ ఈ అడవి మాత్రం చదునుగా, సమాంతరంగా ఉంది.

సిడ్నీలో స్థిరపడిన విదేశీయుల్లో చాలామంది చైనీయులు, ముస్లిములే. వీరిలో చైనీయులు రెస్టారెంట్లు, షాపింగ్ మాళ్లు నడుపుతున్నారు. వీటిలో ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. అందుకే యాత్రికులు ఎక్కువగా చైనావాళ్ల మాల్స్ ఎక్కడున్నాయో అడిగి వెతుక్కుని మరీ వెళ్తుంటారు.

ఇక్కడ మన దేశస్థుల గురించీ కొంత చెప్పుకోవాలి. చాలా ఏళ్ల క్రితం పంజాబీలు మెల్‌బోర్న్‌లో స్థిరపడ్డారట. ఇక్కడ వీరే భారీస్థాయిలో వ్యవసాయం చేస్తున్నారు. వీరు పండించిన గోధుమలు, కూరగాయలు, వేరుశనగలు... ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతాయట. ఇక్కడే స్థిరపడిన ఫిజీ ఇండియన్లు కూడా వ్యాపారాలు చేస్తున్నారు.

ఆస్ట్రేలియాలో మరో మంచి విషయమేమంటంటే... గర్భిణులకు ప్రతి కాన్పుకూ ఆరువేల డాలర్లు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ డబ్బు బిడ్డ సంరక్షణ కోసమట. శాశ్వత నివాస ధృవపత్రం పొందిన విదేశీయులకు కూడా ఈ పద్ధతి వర్తిస్తుంది.

బౌద్ధాలయం

50 ఎకరాల విస్తీర్ణంలో నాన్‌టీన్ బౌద్ధాలయం ఉంది. దీన్ని చైనీయుల సంప్రదాయ పద్ధతిలో నిర్మించారు. చిన్న కొండని తలపించే ఈ బౌద్ధాలయం మన దేశంలోని సాధువుల ఆశ్రమంలా ఉంటుంది. దీన్ని ఏడు అంతస్తుల్లో నిర్మించారు. చివరి అంతస్తులో బుద్ధుని అస్తికలను భద్రపరిచారు.

పక్కనే ఎత్తైన ప్రదేశంలో కనిపించే మరో భవనం గురించి చెప్పుకోకపోతే ఎలా? బుద్ధుని జీవిత విశేషాలు తెలిపే బొమ్మలు, వస్తువులు, పుస్తకాలు ఎన్నో ఈ భవనంలో ఉన్నాయి. హాలు మధ్యలో ఎనిమిది అడుగుల బుద్ధ విగ్రహం ఉంది. ఇక్కడి బుద్ధ విగ్రహాలన్నింటిపైనా స్వస్తిక్ గుర్తు, నుదుట బొట్టు కనిపిస్తుంది.

ఇంకా...

ప్రపంచంలోకెల్లా పెద్ద అక్వేరియం సిడ్నీలో ఉంది. ఇందులో ఐదువేల జంతుజాతులు కనిపిస్తాయి. డార్లింగ్ హార్బర్, విక్టోరియా బిల్డింగ్ షాపింగ్ ప్రియుల మనసు దోచే ప్రదేశాలు. ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదు. ఇక్కడ తప్పకుండా చూడాల్సిన మరో ప్రదేశం టరోంగా జూ. ఇది సుమారు 29 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2500 పైగా జంతువులున్నాయి. ✶

అట్టమీది కథ



నల్లమల కొత్త సొబగులు దిద్దుకుంటోంది. 3568 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన నల్లమలలో మళ్లీ పెద్ద పులుల గాండ్రింపులు ప్రతిధ్వనిస్తున్నాయి. నల్లమల పులుల సామ్రాజ్యంగా మారుతున్న తీరును నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసిఎ) సైతం ధృవీకరించింది. 1970వ దశకంలో వందకు పైగా ఉన్న పెద్దపులుల సంఖ్య ఆ తరువాత క్రమేణా తగ్గసాగింది. 2006వ సంవత్సరంలో తీసిన లెక్కల ప్రకారం కూడా నల్లమలలో పులుల సంఖ్య 40కి తగ్గింది. తాజాగా ఎన్టీసిఎ విడుదల చేసిన లెక్కల ప్రకారం ఇక్కడ పెద్దపులుల సంఖ్య 80కి చేరింది. గణనీయమైన మార్పు కదూ! స్థానిక అటవీశాఖాధికారులు మాత్రం నల్లమలలో 100కు పైగా పులులున్నాయని చెబుతున్నారు. ఐదు జిల్లాల సరిహద్దుల్లో విస్తరించిన ఈ పులుల సామ్రాజ్యంలో ప్రకృతి సైతం పురి విప్పుతోంది. కొత్త వృక్ష జాతులు, జీవరాసులు నల్లమలలో పురుడు పోసుకుంటున్నాయి. అరుదైన జీవరాసులకు ఆ ప్రాంతం నిలయంగా మారుతోంది. జీవ వైవిధ్యానికి కేంద్రంగా మారుతున్న నల్లమల అంతర్జాతీయ పర్యావరణవేత్తలకు పర్యాటక స్థలంగా మారింది.
ఆ విశేషాలేంటో ఈ వారం అట్టమీద కథలో తెలుసుకుందామా!

- వి.రాజగోపాల్

నల్లమల పులుల సామ్రాజ్యం

పర్యావరణ, జంతు, జీవ శాస్త్రవేత్తల సంగతి ఎలా ఉన్నప్పటికీ ఇక్కడకు వచ్చే సాధారణ పర్యాటకుల దృష్టి మాత్రం పెద్దపులిపైనే! వీలైతే అంతదూరం నుండైనా పెద్దపులిని ఒక్కసారి చూడాలని వారు ఆశిస్తారు. పెద్దపులుల చుట్టూ అల్లుకున్న అనేక కథలు, ప్రచారంలో ఉన్న పలు ఊహలే దీనికి కారణం. అయితే, సాధారణ పర్యాటకులకు పెద్దపులులు కంటపడటం దాదాపు అసాధ్యమే! విస్తారమైన ప్రాంతం వాటి ఆవాసస్థలం కావడం ఒక కారణమైతే, పులుల ప్రత్యేక జీవనశైలి మరో కారణం. మరి అటవీశాఖాధికారులు వీటి ఉనికిని ఎలా గుర్తిస్తారు...? కదలికలను ఎలా నిర్ధారిస్తారు ...? ఆడ, మగా తేడాలను ఎలా తేలుస్తారు? ఈ ప్రక్రియలో స్థానిక చెంచుల ప్రాత ఏ మేరకు ఉంది? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది కదూ!

ఉనికిని గుర్తించడం ఇలా ...!

పులి ఉనికిని గుర్తించడానికి సాధారణంగా మూడు పద్ధతులను అనుసరిస్తున్నారు. వీటిలో మొదటిది కీకారణ్యాలను సైతం లెక్క చెయ్యకుండా, అక్కడే నివాసం ఉండే చెంచులు అందించే సమాచారం. అడవుల్లో తిరిగే చెంచులు పులుల ఉనికిని ఇట్టే గుర్తించి అటవీ శాఖాధికారులకు తెలియచేస్తారు. ఈ తరహా సమాచారానికి విశ్వసనీయత అంతంత మాత్రమే! పులి బారిన పడిన జంతువుల మృత దేహాలు కూడా పులుల ఉనికిని తెలియచేస్తాయి. జంతువులను వేటాడటానికి పులి ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తుంది. సాధారణంగా అది ముఖాముఖి దాడి చేయడానికి ఇష్టపడదు, పొదల్లో పొంచి ఉండి జంతువు వెనక భాగంపై పంజాతో ఒక్కసారిగా దాడికి దిగుతుంది. పులి పంజా దెబ్బకి ఎంత పెద్ద జంతువైనా కుప్పకూలాల్సిందే! ఆ తరహా జంతువుల కళేబరాలు దొరికితే ఆ ప్రాంతంలో ఖచ్చితంగా పులి ఉన్నట్టే! పులి ఉనికిని గుర్తించడానికి మరో పద్ధతి కూడా ఉంది. పిల్లి జాతికి చెందిన జంతువులకు ఒక ప్రత్యేక అలవాటు ఉంది. ఆహారాన్ని తిన్న తరువాత ముందు కాళ్లలో చిక్కుకున్న అవశేషాలను తొలగించడానికి అవి చెట్లను ఆశ్రయిస్తాయి. చెట్ల కాండాన్ని తమ కాళ్లతో గోకుతాయి. మన ఇళ్లలో పెంచుకునే పిల్లుల్లో కూడా ఈ తరహా అలవాటుని గుర్తించవచ్చు. పెద్దపులి సైతం పిల్లి జాతికి చెందిన



జంతువే. ఆహారాన్ని తిన్న తరువాత అది చెట్లను ఆశ్రయిస్తుంది. దీంతో చెట్ల బెరడుపై పెద్దపెద్ద చారలు ఏర్పడతాయి. ఆ తరహా చారలను విశ్లేషించడం ద్వారా అవి ఏ జంతువు వల్ల ఏర్పడ్డాయో గుర్తిస్తారు. చెట్టు కాండంపై ఈ తరహా చారలు బాగా పొడవుగా, లోతుగా కనపడితే అక్కడ పెద్దపులి ఉన్నట్టే! పులి విసర్జనాన్ని గుర్తించడం ద్వారా కూడా దాని ఉనికిని నిర్ధారిస్తారు. పులి ఒక ప్రాంతంలో ఉందని తెలిసిన తరువాతే అసలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. పులి కదలికలను నిర్ధారించడం, దాని వయస్సును అంచనా వేయడం, లింగ భేదాన్ని తెలుసుకోవడం, దాని పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు దృష్టి సారిస్తారు.

నిర్ధారించడం ఇలా ...!

పాద ముద్రలను సేకరించడం ద్వారా పులుల కదలికలను నిర్ధారిస్తారు. పులి ఉనికిని గుర్తించిన ప్రాంతాల్లోనూ, అడవిలోని నీటి మడుగుల వద్ద పులి పాద ముద్రల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. అడవి జంతువుల కోసం అటవీశాఖ కూడా ప్రత్యేకంగా నీటి మడుగులను ఏర్పాటు చేస్తోంది. అడవి నేల గట్టిగా ఉండటంతో ముద్రలు స్పష్టంగా కనపడవు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాల్లో మెత్తటి మట్టిని రెండు, మూడు పొరలుగా పోస్తారు. అడవి నేల మీద కనీసం అరంగుళం మందంతో ఈ తరహా ఇసుక దారిని ఏర్పాటు చేస్తారు. పులి తిరిగినప్పుడు దాని పాద ముద్రలు ఈ ఇసుకపై పడతాయి. వెనుక ఎడమ పాదపు ముద్ర పులి ఉనికిని నిర్ధారించడానికి ఖచ్చితంగా ఉపయోగపడుతుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన మూడు కాళ్ల కన్నా వెనక ఎడమ కాలిని పులి కాస్త బరువుగా మోపడమే దీనికి కారణం. ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది ఈ పాద ముద్రలను సేకరిస్తారు. స్థానికంగా నివసించే చెంచు యువకులను దీనికోసం వినియోగిస్తున్నారు. టైగర్ ట్రేకర్స్‌గా పిలిచే వీరికి దీనికోసం ప్రత్యేక కిట్లను అటవీశాఖ అందచేసింది. ప్రతిరోజు తెల్లవారుజామునే వీరు పులి పాదముద్రలను వెతికే పనిలో బయలుదేరతారు. పాదముద్ర కనపడిన చోట కాగితంపై ఆ గుర్తును సేకరించి... ఆ తరువాత ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో నమూనా తయారు చేస్తారు. ల్యాబరేటరిలో వీటిని విశ్లేషిస్తారు. అవి ఒకే పులివా, ఒకటి కన్నా ఎక్కువ పులులున్నాయా అన్న సంగతి తేలుస్తారు. పులుల సంఖ్యను నిర్ధారించడం కోసం ఇప్పుడు సెన్సర్ కెమెరాలను కూడా ఆశ్రయిస్తున్నారు. నీటి మడుగులతో పాటు, అడవి జంతువులు తిరిగే ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఆటోమేటిక్‌గా తిరిగే ఈ కెమెరాలు తమ ముందు జరిగే ప్రతి కదలికలను ఫోటో తీస్తాయి. ఈ ఫోటోలో ఉన్న పులుల చారలను అధ్యయనం చేయడం ద్వారా సంఖ్యను నిర్ధారిస్తారు. పాదముద్రల సేకరణతో పోలిస్తే ఇది మరింత ఆధునికమైనదిగా అధికారులు చెబుతున్నారు. నల్లమలలో పులుల సంఖ్యను అధికారికంగా నిర్ధారించడానికి ఇక్కడకు వచ్చిన ఎన్‌సిటిఎ సభ్యులు మూడు నెలల పాటు ఇక్కడే బస చేశారు. గత ఏడాది అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు నల్లమల అడవుల్లో వారు విస్తృతంగా పర్యటించారు. పాదముద్రలతో పాటు, సెన్సర్ కెమెరాలను వినియోగించి ఇక్కడ దాదాపుగా 80 పులులు ఉన్నట్లు తేల్చారు. ఈ లెక్కలతో విభేదించిన రాష్ట్ర అటవీశాఖ ప్రస్తుతం మళ్లీ పులుల సంఖ్యను నిర్ధారించే పనిలో పడింది.

తేడాలు ఇలా ...!

పులి పాదముద్రల తేడాలను గుర్తించడం ద్వారా అది ఆడో, మగో అధికారులు నిర్ధారిస్తారు. పాదముద్ర సేకరించిన తరువాత దాని చుట్టూ గీత గీస్తే అది నలుచదరంగా వస్తే అది మగ పులి పాద ముద్రగా గుర్తిస్తారు. ఆడ పులి పాద ముద్ర చుట్టూ గీసిన గీత దీర్ఘచతురస్రాకారంగా ఉంటుంది. పెద్దపులికి, చిరుత పులికి మధ్య గల తేడాను కూడా ఇలాగే గుర్తిస్తారు. చిరుతపులి పంజా సాధారణంగా ఏడు నుండి పది సెంటిమీటర్లు ఉండగా, పెద్దపులి పంజా 12 నుండి 14 సెంటిమీటర్లు ఉంటుంది. చిరుత పులి వేళ్లు దగ్గరగా, ఒకదానికి ఒకటి ఆనుకున్నట్లు ఉండగా, పెద్దపులి వేళ్లు దూరంగా ఉంటాయి. జంతువులపై బలంగా దాడి చేయడానికి వీలుగా వేళ్ల నిర్మాణం ఇలా ఉంటుందని చెబుతారు.

అరుదైన జీవజాలానికి నిలయం

నల్లమల అడవులు జీవవైవిధ్యానికి కేంద్రంగా మారుతున్నాయి. అరుదైన వృక్ష, జంతు జాతులను ఇక్కడి అడవుల్లో కనుగొన్నారు. ప్రపంచంలో మరెక్కడా కనపడని కొన్ని రకాల జీవజాలం కూడా ఇక్కడ అడవుల్లో ప్రత్యక్షమైంది. నల్లమల అడవుల్లో పురివిప్పుతున్న ఈ జీవవైవిధ్యం ఇప్పుడు అంతర్జాతీయ పర్యావరణవేత్తలను కూడా ఆకర్షిస్తోంది. 1999 నుండి 2006 వరకు ఇక్కడి అటవీశాఖ ఉన్నతాధికారి కె. తులసీరావు నేతృత్వంలో నిర్వహించిన అధ్యయనంలో జీవవైవిధ్యానికి సంబంధించిన అరుదైన విషయాలను నమోదుచేశారు. ఆ అధ్యయనం ప్రకారం 144 కుటుంబాలకు చెందిన 1541 వృక్ష జాతులను ఇక్కడ కనుగొన్నారు. సుదూర ప్రాంతమైన పశ్చిమ కనుమల్లో మాత్రమే కనిపించే కొన్ని రకాల వృక్ష జాతులు నల్లమల అడవుల్లో కనబడటం విశేషం. పులుల సంఖ్యతో పాటే అరుదైన జంతుజాలానికి నల్లమల నిలయంగా మారుతోంది. వీటిలో కొన్ని అత్యంత అరుదైనవికాగా, కొన్ని ఇక్కడ మాత్రమే కనుగొన్నవి. ప్రాచీన క్షీరదాలకు చెందిన 50 రకాలు, 18 రకాల ఉభయచరజీవులు, 55 రకాల చేపలు, 89





పులి పాదముద్రను గుర్తిస్తారిలా...



చేపను తినే సాలీడు



చెంచు గుడిసె

జాతులకు చెందిన సీతాకోకచిలుకలు, 57 రకాల చిమ్మట జాతికి చెందిన కీటకాలు, 200 రకాల పక్షులు ఈ అడవుల్లో ఉన్నాయి. ఇవి గాక దంతాలు కలిగిఉండే రకానికి చెందిన 30 రకాల జీవజాలాన్ని ఇక్కడ కనుగొన్నారు. వీటిలో ప్రాచీన క్షీరదాలజాతికి చెందిన 11 రకాలను అరుదైన జీవజాలంగా గుర్తించారు. రెండు రకాల పక్షులు, కీటకజాతికి చెందిన మూడు రకాలు కూడా ఇదే కోవకు చెందుతాయి. మరే ప్రాంతంలో కనపడని నాలుగు రకాల సాలీళ్లను నల్లమల అడవుల్లో కనుగొన్నారు. నీటి మడుగుల సమీపంలో ఉండి, నీటిలో ఈదుతూ చేపలను పట్టి తినే ఒక రకం సాలీడు ఇక్కడ కనపడింది. ఇది పూర్తిగా కొత్తది కాకపోయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో కనపడటం మాత్రం మొదటిసారి. మరో రకం దానికి తోడేలు సాలీడు (ఊల్ఫ్ స్పైడర్) అని పేరుపెట్టారు. ఆహారం మీదకి తోడేలు దాడి చేసినట్లు అదికూడా చేయడమే దీనికి కారణం. అత్యంత అరుదైన మరో పది రకాల సాలీళ్లు కూడా ఇక్కడ కనిపించాయి. ఇవిగాక స్కార్పియన్ జాతిలో రెండు కొత్త రకాలు కూడా నల్లమలలో కనుగొన్నారు. నల్లమలను పూర్తిగా శోధిస్తే ఇక్కడ మరింత అరుదైన జీవజాలం కనపడే అవకాశం ఉంది. అయితే, నల్లమలలో విరాజిల్లుతున్న ఈ జీవవైవిధ్యం గురించి, వీటి ప్రాధాన్యత గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడానికి అధికారులు అంతగా ఆసక్తి చూపడం లేదు. అంతర్జాతీయస్థాయి సెమినార్లకు, రీసెర్చి పేపర్లకే ఈ కృషి పరిమితమవుతోంది. దీనివల్ల పేరు ప్రఖ్యాతులు లభించినప్పటికీ అరుదైన జీవజాలం మనుగడకు స్థానికుల సహకారం కూడా అవసరమన్న అంశాన్ని అధికారులు గమనించాల్సిఉంది. ఈ తరహా వృక్ష, జంతు జాలాల పరిరక్షణలో స్థానికులను భాగస్వాములను చేసే ప్రక్రియ ఇప్పటివరకు నల్లమలలో ప్రారంభం కాలేదు.

గిరిజన బిడ్డలు

అభివృద్ధికి దూరంగానే చెంచులు...!

అత్యంత పురాతన అటవీజాతికి చెందిన చెంచులు అభివృద్ధికి ఇంకా దూరంగానే ఉన్నారు. నాగరికత పెరగడంతో కట్టు, బొట్లలో కొంత మార్పు వచ్చినప్పటికీ ప్రాథమికంగా చెంచుల జీవనశైలిలో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. నల్లమలలో 120కిపైగా చెంచుల నివాసప్రాంతాలున్నాయి. నామమాత్రపు కుటుంబాలతో ఉండే ప్రాంతాలను చెంచుపెంటలుగా పేర్కొంటున్నారు. ఈ తరహా ప్రాంతాల్లో రెండు, మూడు కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. కీకారణ్యాల్లో కూడా ఇదే తరహాలో చెంచుల జీవనం సాగుతోంది. మూడు నుండి 30 కుటుంబాలు నివసించే చెంచు గూడేలూ ఉన్నప్పటికీ అవి నామమాత్రమే! మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట అటవీ డివిజన్‌లోని మన్ననూరు అడవుల్లో అప్పాపూర్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలోని కీకారణ్యంలో కేవలం ఒకే కుటుంబంతో ఉన్న చెంచుపెంటను హైదరాబాద్ నుండి వెళ్లిన పాత్రికేయ బృందం పరిశీలించింది. అటవీశాఖ సిబ్బంది తరచు ఆ ప్రాంతానికి వస్తుండటంతో అక్కడి నుండి మరో ప్రాంతానికి తరలివెళ్లే పనిలో ఆ కుటుంబం నిమగ్నమైఉంది. అప్పాపూర్ చెంచుపెంటలో ఐటిడిఏ నిర్మించిన పక్కా గృహాల్లో నివాసముండటానికి చెంచులు సిద్ధపడటం లేదు. వాటి పక్కనే చెంచులకే ప్రత్యేకమైన గుడిసెలను నిర్మించుకున్నారు. పక్కా గృహాల్లో శ్లాబు కూలిపోతోందని వారు చెబుతున్నారు. ఇక్కడ దాదాపుగా 50కిపైగా పక్కాగృహాలను అధికారులు నిర్మించగా ప్రస్తుతం 10 కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. వారు కూడా పక్కా గృహాలను వదిలేశారు. ఈ చెంచుగూడెంలో అతిసార సోకినట్లు సమాచారం అందడంతో అక్కడికి వచ్చిన వైద్య బృందానికి చెంచుల నుండి సహకారం అంతంతమాత్రంగానే అందింది. వైద్యబృందంలోని మహిళా డాక్టర్‌తో పాటు, స్థానిక ఫారెస్ట్ రేంజర్ రాధాకృష్ణ నచ్చచెప్పడానికి ఎంత ప్రయత్నించినప్పటికీ ఫలితం అంతంతమాత్రమే! నలుగురైదుగురు పిల్లలను మాత్రమే వైద్యుల ముందుకు తీసుకువచ్చారు. జబ్బుతో బాధ పడుతున్నప్పటికి ఒక చెంచుమహిళ వైద్యబృందం ముందుకు రావడానికి తీవ్రంగా నిరాకరించింది. డాక్టర్లు మందుగోలీలిచ్చి సరిపుచ్చుతున్నారని, అవి పని చేయడం లేదని ఆ గూడేనికి చెందిన నందేశ్వరి ఆరోపించింది. పదో తరగతి వరకు చదువుకున్న ఆమె అక్కడ పాఠశాలలో విద్యావాలంటీర్‌గా పనిచేస్తున్నారు. సూదిమందు ఇస్తే త్వరగా నయమవుతుందని, డాక్టర్లు ఆ పని చేయడం లేదని,



అటవీ సిబ్బంది

ఇక వారికి చూపించి ప్రయోజనమేమిటని ఆమె ప్రశ్నించింది. చెంచుల ఆహారఅలవాట్లలో కూడా పెద్దగా మార్పు రాలేదు. ఇప్పటికీ అడవుల్లో లభించే చెంచుగడ్డ, ఎలవరగడ్డ, నూలగడ్డ, చనకూరగడ్డ, కలువగడ్డ, తామరగడ్డ, బోదిగడ్డ వంటివాటిపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. వీటితో పాటు వేట మాంసం కూడా అప్పుడప్పుడు ఉంటోంది. బియ్యం వాడకం చాలా అరుదనే చెబుతున్నారు. చెంచుల ఈ తరహా ఆహారపు శైలి వారి జీవితంపై ప్రభావం చూపుతోంది. చెంచుల సగటు జీవితం 45 నుండి 50 సంవత్సరాల మధ్యే వుంటోందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, అప్పాపూర్‌లో మల్లయ్య అనే చెంచు తన వయస్సును 85 సంవత్సరాలుగా చెప్పుకున్నారు. పరిసర ప్రాంతాల్లో చెంచుపెంటల్లో ప్రస్తుతం నివసిస్తున్న వారిలో అందరికన్నా ఆయనే పెద్ద అని అటవీఅధికారులు చెప్పారు. పులుల పరిరక్షణ పేరిట చెంచులను అడవులనుండి బయటకు తరలించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. వీటిని చెంచులు తీవ్రంగా ప్రతిఘటించారు. బలవంతంగా తరలించిన వారు సైతం అక్కడి నుండి పారిపోయి తిరిగి పాత నివాసప్రాంతాలకు చేరుకున్నారు. అడవి వదలి బయటకు రాలేమని, తమ మానాన తమను బతకనియ్యాలని వారు వేడుకుంటున్నారు. తరలించడానికి పదేపదే చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఆ ప్రయత్నాలను మానుకున్నట్లు అటవీశాఖ అధికారులు కూడా ప్రస్తుతం చెబుతున్నారు. అయితే, ఈ మాటపై అధికారులు ఎంతమాత్రం నిలబడతారో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం టైగర్ ట్రేకర్స్‌గా చెంచు యువకులనే అటవీశాఖ నియమించుకుంటోంది. ఎంతో కొంత చదువుకున్న చెంచు యువకులకు పులుల పాదముద్రలను సేకరించడంలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఈ పనికోసం వినియోగిస్తున్నారు. ఈ పనిలో ఉన్న వారికి నెలకు 4వేల రూపాయలు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం 300 మంది చెంచు యువకులు టైగర్ ట్రేకర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

★

అరువు అందాలు

సినీ రంగంలో రాణించాలంటే అందం, అభినయం రెండూ వుండాలి. అభినయంతో సత్తా చాటుకోవాలంటే ముందు చిత్రసీమలో కాలూనాలి. అందుకు అందమే ప్రధానార్హత. సహజసిద్ధంగా లభించిన అందాన్ని మరింత మెరుగులు దిద్దుకోడానికి, పుట్టుకతో వచ్చిన చిన్న చిన్న లోపాలను సరిచేసుకోడానికి తారల ముందున్న తక్షణ మార్గం కాస్మొటిక్ సర్జరీ. అనాకారి బాతును అందమైన హంసగా... అందమైన హంసను అనాకారి బాతుగా మార్చే శక్తి దీనికి వుంది. మరి ఈ సాంకేతిక విజ్ఞానంతో అందాలను అరువు తెచ్చుకుని వెండితెర మీద వెలిగిపోతున్న తారాతోరణం గురించి క్లుప్తంగా....


ఏంజలీనా జోలీ

వెండి తెర మీద వెలిగిపోతున్న సినీ తారలను చూచి 'అబ్బ... ఎంత అందంగా వున్నారు?!' అనుకుంటాం. అలా అంత అందంగా కనబడడానికి వారు తీసుకునే జాగ్రత్తలు అన్నీ ఇన్నీ కావు. అవసరమైతే... మమోప్లాస్టీ, రినోప్లాస్టీ ... వంటివి చేయించుకుంటారు. ముక్కు లోపాలను సరిదిద్దడానికి రినోప్లాస్టీ చేస్తారు. అంటే ముక్కు బాగా పొడవుగా వుండడం, పొట్టిగా వుండడం, లావుగా వుండడం, మరీ సన్నగా వుండడం, నాసికా రంధ్రాలు మరీ పెద్దగా వుండడం, చిన్నగా వుండడం వంటి సమస్యలను సరిచేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఎద మరీ తక్కువగా వున్నా, ఎక్కువగావున్నా సరిచేయడానికి మమోప్లాస్టీ చేస్తారు. సుస్మితాసేన్, ఆయేషా టకియా, బిపాషా బసు ఈ సర్జరీ చేయించుకున్నారు. అయితే మొట్ట మొదటిసారిగా ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పిన హీరోయిన్ మాత్రం సుస్మితాసేన్.

ముందు తరం హీరోయిన్లలో ముక్కును మార్చుకున్న ఘనత శ్రీదేవిదేనేమో! తన ముక్కు బండగా వుందని తెగ బాధపడిపోయేదట! ఎలాగైతేనేం? రినోప్లాస్టీతో నాజూకైన ముక్కును సొంతం చేసుకొని తెగ మురిసిపోయింది. తెర మీద మెరిసిపోయింది. అసలు అందమైన ముక్కుకు కేరాఫ్ అడ్రస్‌లానూ మారిపోయింది. నచ్చే విధంగా నాసికను మార్చుకున్న వారిలో జూహీచావ్లా, ప్రీతి జింటా, ప్రియాంక చోప్రా, శిల్పాశెట్టి, రాణి ముఖర్జీ, షాహిద్ కపూర్, రాఖీ సావంత్, కొయినా మిత్రా, కంగనా రౌనత్, మినిషా లాంబ... కొత్త తరం తార శృతిహాసన్ ... వంటి వారెందరో వున్నారు. 'బాజీగర్'లో శిల్పాశెట్టిని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. ఇప్పటికి అప్పటికి పోలికే లేదు. అప్పట్లో తనది బండముక్కని, మోడ్రన్ లుక్ లేదంటుండేవారని తెగ వాపోయేదట శిల్పా. ఎలాగైతేనేం! తనకు నచ్చే విధంగా ముక్కును మార్చేసుకుంది. ప్రీతి జింటా కెరీర్ ప్రారంభంలోనే ముక్కును సరిచేయించుకుంది. సోల్జర్, దిల్‌సే చిత్రాలలో ప్రీతి ముక్కు కాస్త పొడుగ్గా, లావుగా వుండేది. రినోప్లాస్టీతో ముక్కును పొట్టిగా, సన్నగా చేయించుకుంది. ప్రియాంక చోప్రా కూడా అంతే. ఆమె మొదట్లో నటించిన సినిమాల్లో ముక్కు పొడవుగా, పెదవులు కొంచెం ఎత్తుగా కనిపిస్తాయి. వాటిని సరిచేయించుకుంది. ఇటీవలే వెండితెరపై మెరుస్తున్న తార శృతిహాసన్. తను కూడా నాసికను నాజూగ్గా మార్చుకున్నాకే సినిమాల్లోకి అడుగెట్టింది. ఐశ్వర్యారాయ్ కూడా చిన్నా చితకా మార్పులు చేయించుకుంది.

ఒళ్లంతా ఏదో ఒక మార్పు చేయించుకున్న క్రెడిట్ మల్లికా శెరావత్‌దే. అప్పుడే నాశికను కూడా సరిచేయించుకుంది. ఇషాడియోల్ కూడా అంతేనంటారు. మొదటి చిత్రం కోసం స్క్రీన్ టెస్టులు జరుగుతున్నప్పుడే చికిత్స చేయించుకుంది. పెదవులను సరిచేయించుకున్న తారలూ చాలా మందే వున్నారు. కంగనా రౌనత్, కత్రీనాకైఫ్ ఆ కోవకు చెందినవారు. ఇంక మొహం మీద ముడతలు సరిచేయించుకునేవారి జాబితా కూడా తక్కువేం కాదు. ఆరుపదుల వయసు దాటాక కూడా టీనేజ్ గర్ల్‌లా కనిపించే హేమమాలిని అందుకు చక్కటి ఉదాహరణ. కంటి కింది నీటి సంచులు, నుదుటిమీద, పెదవుల పక్కన చారలు రాకుండా బొటాక్స్ చేయించుకుంటారు డ్రీమ్‌గర్ల్. '3 ఇడియట్స్'లో అమీర్‌ఖాన్‌ను చూసి ఆశ్చర్యపోయుంటారు. మొహం మీద ముడతలు లేకుండా కుర్ర హీరోలా కనిపించాడు అమీర్. సైఫ్ అలీఖాన్, మాధురీదీక్షిత్ కూడా అంతే. హాలీవుడ్ తార ఏంజలీనా జూలీ తన పెదవులు మరింత అందంగా కనబడడానికి ఈ పద్ధతినే ఆశ్రయించింది. అంతా బొటాక్స్ పుణ్యమే.

అయితే ఈ సర్జరీలు విఫలమై ఏళ్లతరబడి మొహాలు దాచుకున్న వారికీ కొదవులేదు చిత్ర పరిశ్రమలో. అందుకు చక్కటి ఉదాహరణ కొయినా మిత్రా. ప్లాస్టిక్ సర్జరీలో ఏమైందో ఏమోగాని ఏకంగా ఏడాదిపాటు మొహం చాటేసింది. డబ్బుకు డబ్బూ పోయె. అనుకున్నదీ జరగకపోయె. ఇంక శిల్పాశెట్టి...సర్జరీకి వెళ్లబోయే ముందర ఎంతగానో భయపడింది. ఒకవేళ ఏదైనా అయితే ... కొంచెం అటూ ఇటూ అయితే ఇంతే సంగతులు! ఏం చెయ్యాలి? అని ఎంతగానో తర్జన భర్జన పడిందట. చివరకు జరగరానిది ఏదైనా జరిగితే ఏదైనా పత్రికకు వ్యాసం రాద్దామని తీర్మానించుకున్నాక ఆపరేషన్ థియేటర్లోకి నడిచిందట. ఇవండీ ప్లాస్టిక్ సర్జరీ ఇష్టాలు...కష్టాలు...!

★

Before శృతిహాసన్ After

ప్రియాంకా చోప్రా

శ్రీదేవి

కొయినా మిత్రా


ఐశ్వర్యారాయ్

శిల్పాశెట్టి

★

కథ



ధర్మం!

- నాగినేని లీలా ప్రసాద్

అది విజయవాడకు సుమారు ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ చిన్న పల్లెటూరు. పేరు రామాపురం. పేరుకి పల్లెటూరే కానీ దేనికీ కొదవలేదు. పాడిపంటలు.... మనోల్లాసభరిత వాతావరణంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందా ఊరు. రకరకాల కూరగాయ మొక్కలు, పూల మొక్కలు, ఆకుకూరల మళ్ల రోడ్డుకు ఓ పక్క ఉంటే... మరో పక్క వరిపంట పచ్చగా కనుల పండుగ్గా ఉంటుంది.

పాడి గేదెలున్న రైతులందరూ పాలను ఊరి చివరున్న పాలకేంద్రంలో పోస్తారు. ఆ పాలు, ఊళ్లో పండిన కూరగాయలు, పూలు విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్టుకు తీసుకెళ్లడానికి ఇంతకుముందైతే ఎన్నో కష్టాలు పడేవారు. లారీలు, వ్యాన్‌లు, ఆటోలు... ఇలా ఏది దొరికితే దానిమీద వెళ్లేవారు. సమయానికి ఏ వాహనం రాకపోతే ఆ సరుకులను అయినకాడికి ఎవరికో ఒకళ్లకి అమ్ముకొనేవారు.

అదే ఊళ్లో విజయ్‌నాథ్ అనే యువకుడు ఉన్నాడు. అతనిది ఓ కమనీయగాథ. అదే ఊళ్లో ఉన్న ఓ ప్రయివేటు స్కూల్లో పదో తరగతి వరకు చదివాడు. ఇంట్లోవాళ్లు పట్టుబట్టి అతనికి చిన్న వయసులోనే వివాహం చేసేశారు.

అన్న కూతురు తన ఇంటికే కోడలిగా రావాలనే ఆశతో తొందర పెట్టి మరీ పెళ్లి చేసింది విజయ్‌కి వాళ్లమ్మ. కుటుంబ పోషణకు ఏ పని దొరికితే అది చేశాడతను. లారీలు, జీబులు, ప్రయివేటు బస్సులపైన డ్రైవర్‌గా చేసి, చివరికి ఆర్టీసీ బస్ డ్రైవర్ అయ్యాడు. భార్య శారదాంబ చిన్న పిల్లలకు ట్యూషన్లు చెబుతూ భర్తకు చేదోడు వాదోడుగా ఉండేది. ఇద్దరు పిల్లలను పక్కూరి కాన్వెంట్‌లో చదివించేవాడు.

ఊళ్లో రైతుల పాట్లు చూచి వాళ్లకు సాయం చేయాలనుకున్నాడు. బస్సుడిపో మేనేజర్‌తో మాట్లాడి తన ఊరి నైట్‌హాల్ట్ బస్సుకు తనే డ్రైవర్‌గా వెళ్లేట్లు వేయించుకున్నాడు.

నాలుగు గంటలకే లేచి హారన్ మోగించేవాడు. మార్కెట్టుకు వెళ్లాల్సిన వాళ్లంతా ఆ హారన్‌తో రెడీ అయిపోయేవారు. బస్సును టైం ప్రకారం ఐదు గంటలకే స్టార్ట్ చేసేవాడు. ఊళ్లోంచి మెయిన్‌రోడ్‌కి మధ్యదూరం రెండు కిలోమీటర్లే. అయినా... అక్కడికి చేరుకోవాలంటే అరగంట పైనే పట్టేది. దారి మధ్యలో వాళ్లందర్నీ ఎక్కించుకోవాలిగా మరి.

బస్సు నడుపుతూనే "ఒరే.. రామన్నా! త్వరగారా... ఇంత లేటయిందేంట్రా బాబూ.. సుబ్బన్నా! ఆ గంప మోయలేకపోతే ఎవరిదైనా సాయం తీసుకోకపోయావా? రా... రా..." ఇలా దారిలో కనపడ్డవారందరి కోసం బస్సాపి వాళ్లందర్నీ ఎక్కించుకుంటూ వెళ్లేవాడు. స్కూల్ టైం లోనైతే చెప్పక్కర్లేదు. అది ఆర్టీసీ బస్సా? స్కూల్‌బస్సా? అన్నట్లుంటుంది.

"ఒరే మనవడా! అది గవర్నమెంటు బస్సనుకున్నావా? నీ కారనుకున్నావా?" అని ఎగతాళి చేసేవారూ లేకపోలేదు.

సాయం చేస్తున్నాడు కదా అని విజయ్‌కి ఇన్ని పూలో, కూరగాయలో ఇవ్వబోతే తీసుకునేవాడు కాదు. "ఎక్స్‌క్యూజ్ మీ.. మీరివ్వదలిస్తే బజారురేటుకే ఇవ్వండి. అంతేగానీ ఫ్రీగా వద్దు. కాకపోతే ఫస్ట్‌క్లాస్ అండ్ నెంబర్ వన్ సరుకు ఇవ్వాలి. మెనీ మెనీ థాంక్స్..." అంటాడే కానీ తీసుకునేవాడు కాదు. తన కష్టాలేవో తనే పడేవాడు. ఎవ్వరినీ ఒక్క రూపాయి కూడా అడగడు. భార్య సంపాదన, తన జీతం... వీటితోనే గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చేవాడు.

"నా భార్యాపిల్లలు నన్నెంతో ప్రేమిస్తారు. తిండికి, గుడ్డకు నో ఫియర్.. అందుకే నేనో కరోడ్‌పతిని తెలుసా?..." అంటూ సంబరపడిపోతాడు.

ఈ గుణాలను చూసే అటు వ్యాపారస్తులు, రైతులు, ఇటు విద్యార్థులు... తమ వయసుకు తగ్గట్టు విజయ్, విజ్జీ, విజ్జన్నా, బాబాయ్... అని ప్రేమగా పిలుస్తారు.

రోజూలాగే ఆ రోజూ ఐదుగంటలకే బస్సు రోడ్డెక్కించాడు విజయ్. ఎప్పటిలాగానే ముందే బస్సెక్కి కూర్చున్నారు బ్రహ్మయ్య మాష్టారు. ఆయన పక్కనే ఉన్న కృష్ణాపురం స్కూల్లో మాష్టారు. రోజూ ఈ బస్సుకే వెళ్లొస్తుంటారు. బస్సు ఫర్లాంగు దూరం వెళ్లిందో లేదో ఆపాడు. గోంగూరగంపతో సామ్రాజ్యాన్ని, వంకాయల బుట్టతో రావమ్మను ఎక్కించుకున్నాడు.

"ఏం విజ్జన్నా... రెండు చపాతీలు తెచ్చా. తింటావా..." అడిగింది సామ్రాజ్యం.

"వద్దులే. రిటర్న్ జర్నీలో తిందువుగానీ. ఉంచుకో..." అన్నాడు.

వచ్చినా రాకపోయినా మధ్య మధ్యలో నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడుతూ అందర్నీ నవ్వించడం విజయ్‌కి అలవాటు. ఎంత కష్టాల్లో ఉన్నవారైనా అతనితో మాట్లాడారంటే చాలు చిరునవ్వైనా నవ్వాల్సిందే.

"అబ్బా.. ఎవరిదగ్గరా ఏం తీసుకోవుగదన్నా! కనీసం వదినమ్మ పెట్టిందైనా తింటావా.. అదీ వద్దంటావా!" అంది సామ్రాజ్యం...

"అమ్మమ్మా... బంగారం కదూ! ఆ అమృతాన్ని ఎలా నో అంటాను. అదే నా ఇంజన్‌కి ఆయిలు..."

"అబ్బో... వదినంటే అంత ప్రేమా...!"

" నా వైఫే ముచ్చటైన నా లైఫ్... అంతే" అంటాడు ముసిముసిగా.

"ఏం చెప్పావన్నా.... చేసేది డ్రైవర్ ఉద్యోగమైనా నీతో మాటల్లో, చేతల్లో, సాయాల్లో చదువుకునే వాడు కూడా పనికి రాడు" అంది సామ్రాజ్యం.

"అరుగరుగో... అయ్యవారు, హరిదాసన్నా బస్సుకోసమే రోడ్డుమీద నుంచున్నారు చూశావా?" అన్నాడు ముందు సీట్లో కూర్చున్న పంచాయితీ బోర్డు గుమస్తా సురేష్‌బాబు. ఆ మాటలు పూర్తికాకముందే అయ్యవారి ముందుకు వచ్చి ఆగింది బస్సు.

"ఏం విజయ్! పెద్దవాళ్లు నిలబడ్డారన్న ఆలోచనే లేదా? ఏమిటాలస్యం ఆ...." మందలింపు స్వరంతో అన్నాడు అగ్నిహోత్రావధానులు.

"గురువు.. దైవం.. ఉండక్కర్లేదటోయ్.." అన్నాడు హరిదాసు.

"ఏవిటీ...? గురువూ.. దైవమా? విజయ్‌కు ఓ పూజా, పునస్కారం కూడానా? నిండుగా, నిలువుగా బొట్టుపెడతాడంతే... అదేదో గొప్ప పూజచేసిన వాడిలా. అంతేగదటోయ్!" అన్నారు అయ్యవారు విజయ్‌నుద్దేశించి ఎగతాళిగా.

"అంటే బొట్టుపెట్టుకుంటే తనూ మనలా

పూజచేసి వచ్చాడు అనుకోవాలిగా నలుగురూ" వేళాకోళమాడాడు హరిదాసు.

ఓ శ్లోకమో.. వచనమో... అయినా వచ్చుంటావా?" ఇంకా పొడిగించారు ఇతరుల అభివృద్ధిని, ఎదుగుదలను చూడలేని అయ్యవారు అదే బుద్ధిగల హరిదాసుతో.

వారి మాటలు వినీ వినీ చిర్రెత్తుకొచ్చింది బ్రహ్మయ్య మాష్టారుకి. కోపాన్ని లోపలే అణచుకుంటూ "అయ్యవారూ... విజయ్‌కి శ్లోకాలు, స్తోత్రాలు రాకపోవచ్చు. వాటన్నింటినీ మనం మనకోసం చదువుతాం. విజయ్ మనందరి కోసం దేవుని ముందు నిలబడి చేతులు జోడించి మనసారా వేడుకుంటాడు. అదే సహస్రార్చన, స్తోత్రమంజరి... తర్వాతే దేవుని బొట్టుపెట్టుకుని బయటికి వస్తాడు. నాలుగేళ్ల వయసునుండే ఇదంతా అతనికి అలవాటు" అన్నారు.

'తిక్క తిన్నగా కుదిరింది. అయ్యవారే పెద్ద గొప్ప అనుకుంటారు...' మనసులోనే అనుకున్నారు బస్సులో జనమంతా.

"ఆ...ఆ... మీరీబస్సులోనే ఉంటారన్న సంగతి మర్చేపోయాను. వాడు మీ పెంపుడుకొడుకు మాదిరి గదా. ఒక్కమాట పడనీయరు. అదేమిటో...! ఆ కూలీజనం కూడా వాడొంటిమీద ఈగ వాలనీయరు. ఇదేం చోద్యమో.. అసలు వాడు పూజ చేయడనే నా బాధంతా... కనీసం చిన్న పద్యమో, శ్లోకమో కూడా రాకుండా ఇంత వాడయ్యాడు. ప్చ్... ఏం చేద్దాం" పెదవి విరిచారు అయ్యవారు.

'ఎప్పుడూ ఎవ్వరినీ నొప్పించని విజయ్‌ని అయ్యగారెందుకలా అంటారు? ఇతనిలో ఎంత వెదికినా చిన్న తప్పు కూడా కనపడదే. మరెందుకు తక్కువచేసి మాట్లాడతారు? ఆయనే పెద్ద గొప్ప అయినట్లు! విజయ్ పనికిరాని వాడన్నట్లు' మనసు కుతకుతలాడుతోంది. ఎక్కడో ఏదో తెలియని బాధ. సీట్లో అసహనంగా కదులుతూ నిట్టూరుస్తున్నారు బ్రహ్మయ్య మాష్టారు.

అంతలో సడన్ బ్రేకుతో బస్సాగిపోయింది. ఏం జరిగిందో ఏమిటో... ఎవరికీ అర్థం కాలేదు. "ఎన్నడూ లేనిది ఇలా జరిగిందేమిటో..." రావమ్మ, సామ్రాజ్యం ఆశ్చర్యపోయారు.

జాగ్రత్తగా నడిపే విజయ్... ఎందుకిలా సడన్ బ్రేక్ వేశాడో అని మాష్టారు ఆలోచనలో పడ్డారు.

"ఏమోయ్... ఉన్నమాటంటే ఉలుకెందుకు? ఇందాక నేనన్నాననేగా! సడన్ బ్రేక్‌వేసి మమ్మల్ని బాధపెడుతున్నావ్..." కుదుపుకు ఎగిరిపడ్డ అయ్యవారు ఆవేశంగా అన్నారు.

"ఏం జరిగిందో చూద్దాం. ఆవేశపడకండి అయ్యవారూ...." మాష్టారు సముదాయించారు.

"చాల్లే... ఊరుకోండి మాష్టారు.. ప్రతిదీ సమర్థించుకోడమేనా? చూడండి... ఒక్క కుదుపుతో ముందు సీట్ రాడ్ నుదుటికి తగిలి ఎంత పెద్ద దెబ్బ తగిలిందో..." నొక్కి నొక్కి పలికారు అయ్యవారు. ఇంతలో ఆగి ఉన్న బస్సులోకి జనం తోసుకువచ్చారు "ఏడీ డ్రైవర్... ఎక్కడ?" అంటూ.

"చూశారా మాష్టారూ.. నే చెప్పలా.. అజాగ్రత్త మనిషి.. దైవం లేదు, జపం లేదు, తపం లేదు... దైవభీతి ఉన్నవాడు చేసే పనేనా ఇది" దులిపేస్తున్నారు అయ్యవారు.

"డ్రైవర్‌బాబూ..! దిగు" ఓ ముసలమ్మ ప్రేమతో కూడిన పిలుపు....

"ఏ తల్లి కన్నబిడ్డో కానీ లేచినవేళ మంచిదైంది" ఓ గొంతుక శ్రుతి కలిపింది

"ఇదంతా... ఆ డ్రైవర్ బాబు మంచితనం" విజయ్‌కు దండం పెడుతూ ఓ అయ్య ఆశీస్సులు...

బస్సులోని జనం కిందికి దిగారు. రోడ్డు మీద ఓ పక్క జనం గుండ్రంగా గుమిగూడారు. అక్కడ ఏమైందో చూడాలని అయ్యవారి తాపత్రయం. మళ్లీ ఎవరైనా ముట్టుకుంటారేమో అనే భయంతో బయటినుండే పక్కనున్నోళ్లని ఏమయిందని అడిగారు.

'ఏముందయ్యా! ఎవరో అబ్బాయి... పుస్తకాల సంచితో సైకిల్ మీద వెళ్తున్నాడు. ఎదురుగా లారీ వస్తుందని పక్కకు తప్పుకోబోయాడు. మీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వెయ్యకపోతే పాపం బిడ్డ అన్యాయమైపోయేవాడే. మీ బస్సు ఆపబట్టే ఆ పిల్లాడు బతికాడు. దేవుడయ్యా మీ డ్రైవర్" చెప్పుకుపోతున్నాడు ఓ వృద్ధుడు.

"దేవుడా.. కాకరకాయా. నామొహం పగిలిపోతేనూ. పిల్లాడి అదృష్టం బాగుంది. బతికి బయటపడ్డాడు. అంతేగానీ డ్రైవర్ దేవుడవుతాడా?" విసుక్కున్నాడు అయ్యవారు.

ఏం జరిగిందో చూద్దామని బ్రహ్మయ్య మాష్టారు ఆ గుంపులోకి వెళ్లారు. కిందపడిన బాబును పక్కకు తిప్పి, కొద్దిగా నీళ్లు వాడి మొహమ్మీద చల్లారు.

పిల్లాడు తేరుకుని "మాష్టారూ!" అంటూ అమాంతంగా ఆయన్ని చుట్టుకుపోయాడు.

తల నిమురుతూ 'ఎవరీబాబు? తన స్కూల్ పిల్లాడేమో' అని మొహం తనవైపు తిప్పుకుని చూశాడు. అంతే... "విజయ్" అంటూ అరిచారు మాష్టారు.

సడన్ బ్రేకుతో నిశ్చేష్టుడై అచేతనంగా సీటులోనే కూర్చుండిపోయిన విజయ్ ఆ పొలికేకతో తెప్పరిల్లి గుంపులోకి వచ్చాడు. సరాసరి మాష్టారు దగ్గరికి వెళ్లి పిల్లాడిని బస్సులోకి తీసుకొచ్చి సీట్లో పడుకోబెట్టాడు.



"అయ్యోరూ! ఒక్కసారి లోపలికి రండి. ఆయనకి దారివ్వండయ్యా..." బిగ్గరగా అరిచారు మాష్టారు.

"ఊ... వీడికి ఇప్పుడు ఉపచారాలు... మంత్రాలు... తంత్రాలు.. వైద్యం చేయాలి కాబోలు. ఏ మాత్రో, భస్మమో వాడి మొహాన కొడ్తే సరి. ఇటువంటప్పుడే అందరికీ నేను గుర్తుకొచ్చేది" అంటూ లోపలికెళ్లారు అయ్యవారు. సీట్లో ఉన్న పిల్లాణ్ణి చూశారంతే..

"అరే... అనంత్! బాబూ...! " అంటూ పిల్లాణ్ణి ఒళ్లోకి తీసుకున్నారు. "నాన్నా.. బాబూ... ఏమయిందిరా నీకు" అంటూ అదేపనిగా వాడి శరీరాన్ని నిమరసాగారు.

"ఎవరా అబ్బాయి?" గుంపులో నుండి ఎవరిదో ప్రశ్న.

"ఎవరో కాదు నాయనా... నా మనవడే. వద్దన్నా వినకుండా రోజూ ట్యూషన్‌కి సైకిల్‌మీద వెళ్తాడు" ఏడుపులాంటి మాటలతో బాధపడ్డాడు అయ్యవారు. పైకి చూస్తూ రెండు చేతులెత్తి నమస్కరించారు.

"ఓ అయ్యవారూ! కనపడని దేవుడికి కాదయ్యా దండం పెట్టాల్సింది. అదుగో ఎదురుగా ఉన్నాడే డ్రైవర్. ఆయనకు పెట్టు" అన్నారందరూ.

"నిజమే... విజయ్! చిన్నవాడివైనా నీకు నమస్కరిస్తున్నానురా..."

"ఆ... ఆ... అయ్యవారూ.. నా డ్యూటీ నే చేశానంతే. ఎక్స్‌క్యూజ్‌మీ.. చిన్నవాణ్ణి... మీరలా అస్సలు నాకు దండం పెట్టకూడదు. సారీ... ప్లీజ్..." అన్నాడు విజయ్‌నాథ్.

వచ్చిన అవకాశాన్ని పోనీకూడదనుకున్నారు మాష్టారు. "చూశారా అయ్యవారూ! శ్లోకాలు, మంత్రాలు రావు, ఓ పాటా లేదు, వచనమూ రాదు. తను పెట్టుకునే బొట్టు తప్పన్నారే. ఇప్పుడు చెప్పండి. నిజమైన పూజ ఎవరిది? మీదా? విజయ్‌దా? తనకి వచ్చిన శ్లోకం, నచ్చిన స్తోత్రం ఎదుటి వారికి నష్టం, కష్టం కలిగించకుండా డ్రైవింగ్ చేయడం.

శ్లోకం, స్తోత్రం, జపం, తపం, దేవుడు, దేవత... అంతా తన విద్యుక్తధర్మమే... అది చక్కగా నెరవేరాలనే దండం పెట్టుకుంటాడు. తన పనినే దేవుడని భావించాడు కాబట్టే ధ్యాసంతా బస్సు నడపడంలోనే పెట్టాడు. అలా కాకుంటే ఏం జరిగేదో ఒక్కసారి ఊహించండి"

"అమ్మో..." అరిచారు అయ్యవారు.

"ఒక రకంగా చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరి ధర్మం వాళ్లు నెరవేర్చుకుంటూ పోతే, గుళ్లూ గోపురాలే కాదు... ఏ విధమైన జపతపాదులూ అక్కర్లేదు. అందుకు ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం" అన్నారు మాష్టారు. ★

వికాసం

మనసు మాట



మానవ శరీరంలో రెండు వ్యవస్థలుంటాయి. మొదటిది శరీరం, రెండవది మనసు. మానసిక వ్యవస్థకు కేంద్రం మనిషి మెదడు. విచిత్రమేమిటంటే తొంబై ఎనిమిది శాతం పరిమాణమున్న శరీరాన్ని శాసించేది కేవలం రెండు శాతం మాత్రమే ఉన్న మెదడు. మానవ శరీరం, మెదడుల నడుమ సమన్వయం, సహకారం ఉంటాయి కాబట్టి మానవ శక్తి సద్వినియోగపడుతోంది. మెదడు కన్పిస్తుంది. మనసు కన్పించదు. మరి దానిని గుర్తించడమెలా? మనసు అనేది ఒక భావ పరంపర. ఆలోచనలు, సంకల్పం వంటివి మనసు గుర్తింపుకు ఆధారాలు. ఈ ప్రపంచంలో మన శరీరం ఒక భాగం మాత్రమే. అదే మనసు ప్రత్యేకత. మన మనసు ఇంద్రియాలచేత పని చేయిస్తుంది. జ్ఞానేంద్రియాలు బయటికి కన్పిస్తున్నా... వాటికి ప్రపంచం కన్పించదు. ప్రపంచాన్ని వీటి ద్వారా చూసేది మనసు మాత్రమే.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

శక్తి గురించి ప్రస్తావించగానే దాని భిన్న రూపాలు మనకు గుర్తుకొస్తాయి. యాంత్రిక శక్తి, విద్యుత్ శక్తి, రసాయన శక్తి, ఉష్ణ శక్తి ఇవన్నీ శక్తి రూపాలే. శక్తి ఒక రూపం నుండి మరొక రూపానికి మారగలదు. మనం భుజించిన ఆహారం జీర్ణమై మన శరీరానికి కావలసిన శక్తిని సమకూరుస్తుంది. రక్త ప్రసరణ, శ్వాసక్రియ, నరాలు, కండరాలు పని చేయడానికి, చూడడానికి, గుర్తుంచుకోడానికి, ఆలోచించడానికి ఈ శక్తి వినియోగమౌతుంది. ప్రతి మనిషికి ఏదో ఒక రకమైన వ్యక్తిత్వం ఉంటుంది. ఈ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేందుకు ఉపయోగపడే శక్తినే మానసిక శక్తి అంటారు. దీన్ని సైకిక్ ఎనర్జీగా పిలుస్తారు. మనిషికి గల సహజ బుద్ధి నుండి వ్యక్తిత్వాన్ని ఆచరణలో చూపించే పనులన్నింటికి కావలసిన శక్తి లభిస్తుంది. మొత్తం మానసిక విధానాలకు మార్గదర్శిగా ఉండే శక్తి మొత్తాన్ని సహజ బుద్ధి అంటారు. ఈ సహజ బుద్ధి లక్ష్యం శరీర అవసరాలను తీర్చడమే. సహజ బుద్ధి మనిషిని ఆహారం తినేందుకు సిద్ధం చేస్తుంది. తీసుకున్న ఆహారం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. ఆహారం భుజించగానే ఆకలి చల్లారుతుంది. అప్పుడు మనిషి శారీరకంగా, మానసికంగా సంతృప్తి పొందుతాడు.

దెని కారణంగా సహజ బుద్ధి ప్రేరణకు లోనవుతుందో దానిని లేకుండా చేయడమే సహజబుద్ధి పని. ప్రవర్తన, అనుభవాల సారాన్ని బట్టి మనిషి ప్రవర్తన ఉంటుంది. పరిసరాలు కల్గించే ప్రేరణకు జవాబు చెప్పే విధానమే మనిషి ప్రవర్తన. ఉదాహరణకు ప్రోత్సాహక బహుమతి ఇస్తే మనిషి ప్రవర్తనలో మార్పు వస్తుంది. బిడ్డ ఒక బొమ్మ గీసినప్పుడు తల్లి మెచ్చుకుంటే ఆ బిడ్డ మరికొన్ని బొమ్మలు గీసేందుకు తయారవుతాడు. శిక్షల వల్ల కూడా ప్రవర్తనలో మార్పు వస్తుంది. ఉదాహరణకు ఓ పిల్లవాడికి చేతిలో వున్న వస్తువుల్ని విసిరేసే అలవాటుంది. అలా వాటిని విసిరేయడం ఆపితే ఆడుకునేందుకు మరిన్ని బొమ్మలు ఇస్తానని షరతు పెట్టి దురలవాటును మాన్పించొచ్చు. అలవాటు మార్చుకోకపోతే పరోక్షంగా శిక్ష అనుభవించాల్సి వస్తుందని బిడ్డ తన ప్రవర్తన మార్చుకుంటాడు. ఇతరుల మనసెరిగి మసలేవారు సులువుగా సమస్యలను పరిష్కరించగల్గుతారు. నైపుణ్యం లేని వ్యక్తులు ఇతరులతో సంప్రదింపులు జరిపేటప్పుడు సంఘర్షణకు దిగుతారు. ఇటువంటి వ్యక్తులే తరచూ సమస్యల సుడిగుండంలో ఇరుక్కుంటుంటారు. కొంతమంది పిల్లల్లో ప్రతికూల ప్రవర్తన ఉంటుంది. వారు స్కూల్‌కి వెళ్లడానికి, హోంవర్క్ చేయడానికి ఏవేవో వంకలు చెప్తారు. కడుపు నొప్పిగా ఉందని, వాంతయ్యేలా ఉందని వంకలు చెప్తారు. అందుకే వెళ్లనని మొరాయిస్తారు. అలాంటి చిన్నారులతో స్కూల్ హోంవర్క్ పూర్తిచేయించాలి. స్కూల్‌కి వెళ్తే కొత్త విషయాలు తెలుస్తాయని, అనారోగ్యం దరిచేరదని నచ్చజెప్పి స్కూలుకెళ్లేలా చేయాలి. సాకులు చెప్పే ధోరణిని పోగొట్టాలి.

ఇంతకీ... మనిషి ప్రవర్తన మారేందుకు ఎటువంటి పద్ధతి ఎన్నుకోవాలి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. దీన్ని మాత్రం ఎవరికి వారే రూపొందించుకుని పాటించాలి.

రెండు మనసులు

ప్రతి వ్యక్తికీ రెండు మనసులుంటాయి. ఒకటి లోపలి మనసు. రెండవది బయటి మనసు. ఈ రెండింటి ఆధీనంలో మానసిక శక్తి ఉంటుంది. లోపలి మనసు తన గుప్పిట్లో 90 శాతం శక్తిని ఉంచుకుంటుంది. బయటి మనసు ఆధీనంలో మిగిలిన 10 శాతం ఉంటుంది. బయటి మనసు ఆలోచనలకు పుట్టినిల్లుగా ఉంటుంది. లోపలి మనసు వ్యూహ రచనలు చేస్తుంది. ఏదైనా సమస్య ఎదురైతే బయట మనసు ఒక పరిష్కారం చెబితే లోపలి మనసు మరొక పరిష్కారం చెబుతుంది. లోపలి మనసును కాదని బయటి మనసు విజయం సాధించలేదు. రెండు మనసులు సమిష్టిగా కలిసి పని చేసేటట్లు చేసుకోవాలి. ఎవరో ఒకరు ఎదురవుతారు. అతని పరిచయం గుర్తుకురాదు. అయినా మర్యాదకోసం తెలిసినట్లుగా ప్రవర్తిస్తాం. అదొక నటన. దీనిని లోపలి మనసు అంగీకరించదు. ఈ కారణంగానే మన శరీర భంగిమలు, మాట తీరు, కదలికలు, చూపులు అతడిని గుర్తుపట్టలేదన్న నిజాన్ని బయట పెట్టేస్తాయి. లోపలి మనసుతో రాజీ పడాలంటే బయటి మనసు ఎదురైన వ్యక్తితో అతని పరిచయం మరచినట్లు అంగీకరించాలి. అప్పుడు రెండు మనసుల మధ్య విభేదాలు ఉండవు. లోపలి మనసు ఇచ్చే సలహాలు మనకు నచ్చకపోతే దానిని మన ఆధీనంలో ఉంచుకునే వ్యూహం రూపొందించుకుని ఆచరణలో పెట్టాలి. కానీ ఈ పని చాలా కష్టం.

మనం ... మన ఆలోచనలు

శరీరం మనసు అని విడివిడిగా చెప్పుకున్నా ఇవి ఒకదానితో మరొకటి పెనవేసుకుని ఉంటాయి. కేంద్ర నాడీ మండలం మనసుకు సంబంధించిన వ్యవహారాలు చక్కబెడుతుంటుంది. మెలకువగా ఉన్నంతసేపూ మనం ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటాం. శరీరం నిద్రించినా మనసులో ఆలోచనల దొంతరలు దొర్లుతూనే ఉంటాయి. ఆలోచనలు, ఆవేశాలు, ఉద్వేగాలు, సంవేదనలు, మనో రూపాలు వంటి తరంగాలతో నిరంతరం మనసు బిజీ బిజీగా ఉంటుంది. ఆలోచనలు రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది ఆటిస్టిక్ థింకింగ్ (ఎ-థింకింగ్), రెండవది రియాల్టీ థింకింగ్ (ఆర్- థింకింగ్). మన ఆలోచనలు ఊహలతో కూడి వాటిలో పొంతన లేదా లాజిక్ ఉండదు. నిద్రించేముందు ఇటువంటి ఆలోచనలు వస్తూ ఉంటాయి. నిద్ర లేచే సమయంలో మత్తుగా ఉన్నప్పుడు కూడా వస్తాయి. వీటినే ఎ-థింకింగ్ అంటారు. వాస్తవానికి దగ్గరగా ఉండే ఆలోచనలు ప్రతి మనిషిలోనూ ఉంటాయి. ఈ రెండింటి సంయుక్త చర్యల ఫలితమే సృజనాత్మకత. మనిషి వాస్తవాన్ని ఆలోచించడం మరిచి ఎప్పుడూ ఊహాలోకాల్లో లాజిక్ లేని ఆలోచనలతో ఉండిపోతుంటే మానసిక రోగిగా పరిగణించవచ్చు. వాస్తవికతతో ఆలోచించేవారు జీవిత మాధుర్యాన్ని, చతురతను, సృజనాత్మకతను అందుకోలేరు.

★

విలువైన సమాచారం

ఇరవయ్యో శతాబ్దంలో జాతీయోద్యమం బ్రహ్మాండంగా విజృంభించింది. ఈ జాతీయోద్యమం తెలుగునాట ఆంధ్రోద్యమం రూపంలో కూడా తలెత్తింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి ఆంధ్రదేశం బీజాలు నాటింది. ఫ్యూడల్ శక్తులకు, దేశ్‌ముఖ్‌లకు, దేశ్ పాండ్యాలు, జమిందార్లకు, నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణాలో వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాలు...ఆంధ్రప్రాంతంలో స్వాతంత్ర్యోద్యమాలు, వందేమాతర ఉద్యమంతో ప్రారంభమయ్యాయి. అర్ధశతాబ్దంగా సాగిన ఈ ఉద్యమాలలో ఎందరో త్యాగాలు చేశారు. దాదాపు 71 మంది రాజకీయవేత్తల జీవిత చరిత్రలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, గోలకొండ, సియాసత్ (ఉర్దూ), భారతి, తెలుగు స్వతంత్ర, కృష్ణా పత్రికల నుండి రచయిత విలువైన సమాచారం సేకరించి గ్రంథస్థం చేశారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం జీవిత చరిత్రతో ఆరంభమై (పేజీ 11) 2009 సెప్టెంబర్ 2న మృతిచెందిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి (పేజీ 227) వ్యాసంతో ఈ గ్రంథం ముగిసింది. తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, ముగ్దూం మొహియుద్దీన్, షోయెబుల్లాఖాన్, దాశరథి, కాళోజీ లాంటి వారి చరిత్రల్లో యువత అధ్యయనం చేయాల్సిన అంశాలెన్నో ఉన్నాయి. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ (పేజీ 193), జె. ఈశ్వరీబాయి, సరోజినీ నాయుడు లాంటి వారి జీవిత చరిత్రలు మహిళలకు ప్రేరణనిస్తాయి. 'సాలర్‌జంగ్' (పేజీ172) వస్తు సేకరణ, కళాఖండాల సేకరణ అభిలాష, మ్యూజియం స్థాపన లాంటి అంశాలు, ఆయన్ని నిజాం వ్యతిరేకించడం, మజ్లిస్ నేత ఖాసిం రజ్వీ బెదిరింపులు... సాలార్‌జంగ్ జాతీయవాదం, నేటి కాంగ్రెస్ నేతలతో చర్చలు... పాఠకుల్లో దేశభక్తిని, విషయ సేకరణ, వస్తు సేకరణపై అభిలాషను కలిగిస్తాయి. కోదాటి, వావిలాల, గౌర్ల గ్రంథాలయోద్యమాలు ఆసక్తిదాయకంగా చదివింపజేస్తాయి. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పిలుపునిచ్చి నాడు-నేడు-రేపు కూడా ఆదర్శ విలువల రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన సుందరయ్యగారి లాంటి వారిని రాత్రికి రాత్రి డెన్ వదలిపెట్టి పారిపోయి పోరాటానికి వెన్నుపోటు పొడిచి పోలీసు చర్య తర్వాత పోరాటం తప్పు అన్న "రావి" లాంటి వార్ని, వివాదగ్రస్త ముఖ్యమంత్రుల్ని ఒకేచోట చేర్చడం వల్ల విద్యార్థులకు ఏ రాజకీయాలు కరెక్టో ఎవరు దేశ భక్తులో, ఎవరు భుక్తులో అర్థం కాని అస్పష్టత వస్తుంది కదా.

తెలుగు ప్రముఖులు, జి. వెంకట రామారావు, వెల: 150/-, పేజీలు : 230, ప్రతులకు : రచయిత పేరుతో, ఇం.నెం.18-7-739/2, గౌలిపురా, హైదరాబాద్.

- తంగిరాల చక్రవర్తి

కొత్త పుస్తకాలు

అడవిబిడ్డల గాథలు

గోదావరి అనగానే అందమైన పాపికొండలు, పచ్చటి వాతావరణం గుర్తుకు వస్తాయి. కానీ ఈ గోదావరి గాథల్లో మాత్రం బాధలు, కష్టాలే కనిపిస్తాయి. ఉప్పొంగిన గోదావరి నిర్దాక్షిణ్యంగా అనేక మంది ప్రాణాలను, పంట పొలాలను... ముంచేస్తూ సాగిపోతుంది. రచయిత ఐటిడిఎ అధికారి. పరిస్థితుల ప్రభావం వల్ల కావచ్చు, విధి నిర్వహణ నియమాల వల్ల కావచ్చు, మరే కారణాలైనా కావచ్చు ఆదివాసులకు, గిరిజనులకు తన వంతు సహాయం చేయాలనుకున్నా, చేయలేక పోయానన్న బాధ ఈ కథల్లో అగుపిస్తుంది. ఐటిడిఎ సంస్థల్లో నియమాలు, సూత్రాలు గిరిజనులకు, ఆదివాసీలకు సహాయపడుతున్నాయా? లేదా వారి ఆస్తులను అక్రమంగా సొంతం చేసుకునే గిరిజనేతరులకు వంత పాడేవేనా? అన్న అనుమానం వస్తుంది. అనుమానమే కాదు, అది నిజమేనని ఈ గోదావరి గాథలు చదివితే అర్థమౌతుంది. గిరిజనులకు ఆ అడవి ప్రాంతంలో అడవి జంతువులతో ఎంత ప్రమాదమో ఈ గాథల్లో తెలుస్తుంది. వైద్య సదుపాయాలు, సరైన రోడ్లు లేక ప్రమాదాల వల్ల ఎంతమంది చనిపోతున్నారో లెక్కేలేదు. అయినా వారు ఆ ప్రాంతాన్ని వదలి రారు. పుట్టిన గడ్డ నుండి వారిని ఎవరూ వేరు చేయలేరు మరి. గిరిజనుల ఆచార వ్యవహారాలు, వారి జీవన శైలి, అతిథి మర్యాదలు అన్నీ ఈ గాథల్లో దర్శనమిస్తాయి. ఈ కథలన్నీ అద్దంలో కనిపించే గోండుజాతి, గిరిజనుల స్థితిగతులు. "మమ్మల్ని ఈ భూమి నుండి వేరుచేయకండి, మేము బతకలేం" అనే గిరిజనుల మాటలు ఆ ప్రాంతంతో వారికున్న విడదీయరాని బంధాన్ని తెలియజేస్తాయి. 'దండారీ' కథలో గోండు పటేల్ (కొటనాక మాన్కు) తమ ఆచారం నిర్వర్తించడానికి జైలుకెళ్లడానికైనా వెనుకాడలేదు. 'చింతా సాలక్క' కథలో చింతా సాలక్క "భూమి ఇప్పించకపోతే ఇళ్లు ఎవరికి కావాలి? మీ ఇతర సహాయం ఎవరిక్కావాలి?" అంటూ వేసిన ప్రశ్నల గురించి ప్రతి ఒక్క అధికారీ, నేతా ఆలోచించాలి. పని చేసుకోడానికి భూమి లేకుండా చేసి, ఎన్ని సౌకర్యాలు ఇచ్చినా అవన్నీ వారికి తాత్కాలికమే.

గోదావరి గాథలు, ఫణికుమార్, వెల : 75/-, పేజీలు :92, ప్రతులకు : అశోక్ బుక్ సెంటర్, విశాఖపట్నం-530002. అక్షర, హైదరాబాద్ -34.

- మల్లేశ్వరి



జీవితాన్ని జయించండి...!
యువమిత్ర, వెల : 30/-, పేజీలు :72.

★★★

విజేతగా జీవించండి...!
యువమిత్ర, వెల : 30/-, పేజీలు :72.
ప్రతులకు : శ్రీ బాలాజీ పబ్లికేషన్స్.

★★★

టైమ్ మేనేజ్‌మెంట్
యువమిత్ర, వెల : 30/-, పేజీలు :72.

★★★

సంతోషం
ఆనందంగా జీవించడం ఎలా...?
యువమిత్ర, వెల : 30/-, పేజీలు :72.

★★★

ఇంటర్వ్యూలో
విజయం సాధించడం ఎలా?
యువమిత్ర, వెల : 30/-, పేజీలు :72.

★★★

వనితలు మెచ్చే
వంటింటి చిట్కాలు
పి. పవని (ఫ్యాషన్ డిజైనర్)
వెల : 30/-, పేజీలు :72.

★★★

స్త్రీలకు సౌందర్య చిట్కాలు
పి. పవని (ఫ్యాషన్ డిజైనర్)
వెల : 30/-, పేజీలు :72.

★★★

బ్యూటీ గైడ్
పి. పవని (ఫ్యాషన్ డిజైనర్)
వెల : 30/-, పేజీలు :72.

★★★

ఇంటింటా వంటింటి వైద్యం
తంగిరాల చక్రవర్తి
వెల : 30/-, పేజీలు :72.

★★★

అందరికీ అందుబాటులో...
హెర్బల్ వైద్య చిట్కాలు
జె. దివ్యక్రాంతి,
వెల : 30/-, పేజీలు :72.
పై అన్ని పుస్తకాల ప్రతులకు : శ్రీ బాలాజీ పబ్లికేషన్స్.

★★★

కార్యకర్తల కరదీపిక
బత్తుల కార్తీక్ నవయాన్
వెల : 25/-, పేజీలు :56.
అన్ని పుస్తక కేంద్రాలు.

చుక్కలు కలిపేద్దాం

ఫ్రెండ్స్! ఇక్కడ చుక్కల్లో దాక్కున్నదెవరో చెప్పుకోండి చూద్దాం. ఏంటి తెలియడంలేదా? అయితే 1 నుంచి 77 వరకు చుక్కలు కలిపి చూడండి.





రెండుతో 4 ఎలా?

హలో పిల్లలూ... ఇక్కడున్న అగ్గిపుల్లల్లో రెండు పుల్లల్ని తీసి వేరే చోట పెట్టి జవాబు నాలుగు వచ్చేలా చేయాలి. ఏ పుల్లలు తీసి ఎక్కడ పెడితే నాలుగు వస్తుందో చూసి పెట్టేయండి మరి.

పెద్దల సంతకం



పిడుగులూ ... ఈ సంతకం ఎవరిదో తెలుసా? గొప్ప చిత్రకారుడు ఎం.ఎఫ్.హుస్సేన్‌ది.

కుందేలు బొమ్మ కావాలా...!



హాయ్ నేస్తాలూ... కుందేలు బొమ్మ భలేగా ఉంది కదూ! అయితే మీరూ దీన్ని చేస్తారా? పెద్ద కష్టమేమీ కాదు. చాలా తేలిక. మొదలెడదామా మరి.

ఏమేం కావాలంటే...

మాడిపోయిన బల్బు, దూది
మిరియాలు, పెద్ద సైజు నల్ల బొట్టుబిళ్లలు
కత్తెర, ఫెవికాల్, తెల్ల ముఖమల్ క్లాత్, పెన్సిల్, సూది, దారం.

ఎలా చేయాలంటే...

బల్బు చుట్టూ మందంగా దూదితో చుట్టాలి. ఈ దూది బల్బు చుట్టూ సమానంగా ఉండేలా చూసుకోవాలి. ముఖమల్ క్లాత్‌ని కుందేలు ఆకారంలో రెండు మడతలమీద కత్తిరించుకోవాలి. దాన్ని దూది చుట్టుకున్న బల్బుపైన కుట్టేయ్యాలి. కుందేలుకి చెవులుంటాయి కదా. వాటికోసం చెవుల ఆకారంలో ముఖమల్ క్లాత్‌ని రెండు మడతల మీద పెన్సిల్‌తో గీసుకోవాలి. దాని అంచుల వెంబడి కత్తిరించుకోవాలి. అందులో కూడా దూదిని పెట్టి కుందేలు తల భాగంలో కుట్టాలి. అలాగే తోకను కూడా కుట్టుకోవాలి. ఇప్పుడు కుందేలుకి కళ్లు, నోరు ఏర్పాటు చేద్దాం. కళ్లు ఉండే భాగంలో రెండు మిరియాలు ఫెవికాల్‌తో అతికించుకోవాలి. నోరు భాగానికి నల్ల బొట్టుబిళ్లలు ఉన్నాయి కదా. వాటిని సగానికి కత్తిరించి నోరు ఉండే ప్రదేశంలో అతికించాలి. అంతే కుందేలు బొమ్మ రెడీ అయిపోయింది.

దీన్ని మీ ఇంటి సెల్ఫ్‌లోనో, టీవీపైనో పెట్టి చూడండి ఎంత బావుంటుందో! దీన్ని మీ స్నేహితులకి చూపించండి. భలే చేశావని మిమ్మల్ని ఎంతగా అభినందిస్తారో.



ఆరు వరుసలు

అక్కడ 24 మంది పిల్లలున్నారు. వారిని వరుసకు ఐదుగురు ఉండేలా ఆరు వరుసల్లో నిలబెట్టాలి. ఆలస్యం ఎందుకు? ఆ పనిలో పడితే నయం కదా.

ఒకే గీతతో...

తొమ్మిది సున్నాలని మూడు వరుసల్లో పెట్టారు. వాటిని నాలుగు గీతలతో కలుపుకుంటూ పోవాలి. సున్నాలని కలిపేటప్పుడు పేపరుమీద పెన్ను తీయకూడదు. పైకి లేపకూడదు.ఒకే గీతతో కలపాలి. సాధ్యమేనా?

0 0 0

0 0 0

0 0 0

గ్లోబు గూడు పక్షి

ఈ వారం మనం చెప్పుకోబోయే పక్షి పేరు ఎర్రమునియా. దీన్ని మీరూ చూసేవుంటారు. పక్షులంటే ఇష్టపడేవాళ్లు దీన్ని ఖచ్చితంగా పెంచుతారు. ఇది ఊరపిచ్చుకకన్నా చిన్నగా ఉంటుంది. మామూలుగానైతే ఆడ,మగ పక్షులకు బూడిదరంగు ఈకలుంటాయి. కానీ గూడు కట్టుకునే సమయంలో మగ పక్షికి రంగు రంగుల ఈకలు వస్తాయి. వాటి మీద అక్కడక్కడా తెల్ల చుక్కలు కూడా ఉంటాయి. ముక్కు, వెనుక భాగం మాత్రం ఎర్రగా ఉంటుంది. దీని గూడు ఎలా ఉంటుందో తెలుసా? అచ్చంగా గ్లోబులా గుండ్రంగా ఉంటుంది. అంతేకాదు లోపల మెత్తగా ఉండడానికి సన్న గడ్డిని కూడా పరుచుకుంటుంది. ఇది ఎప్పుడూ గుంపులో తిరుగుతుంది.

తేమ ఉన్న ప్రదేశాల్లో, గడ్డి పూలున్న ప్రదేశాల్లో ఉండడానికి ఇష్టపడుతుంది. గడ్డి గింజలను, కీటకాలను ఇష్టంగా తింటుంది. దీనిలో చుక్కల మునియా కూడా ఉంది. చుక్కల మునియాకీ, ఎర్ర మునియాకీ తేడా దాని తోక. చుక్కల మునియాకి తోక మామూలుగా ఉంటే, ఎర్రమునియాకి తోక గుండ్రంగా ఉంటుంది. ఇది సూటిగా కాకుండా పైకీ కిందికీ అలల్లాగ ఎగురుతుంది.

ACORDEÓN
ALEGRÍA
BAILAR
BAILES
BAJO
BANDERA
BLANCO
BURRITO
CELEBRACIÓN
COLORES RADIANTES
COMIDA
COSAS TÍPICAS
FIESTA
GLOBOS
GUITARRA
MARACAS
MÉXICO
MÚSICA
PIÑATA
PUEBLA
RISA
ROJO
SOMBRERO
VERDE
ÁGUILA

C	E	L	E	B	R	A	C	I	Ó	N	M
K	P	K	É	B	A	B	O	M	M	M	U
F	I	É	J	A	U	J	L	S	C	É	K
B	Ñ	W	É	L	C	R	O	A	V	X	S
B	A	I	L	E	S	M	R	C	N	I	O
U	T	O	P	G	B	O	E	I	E	C	B
J	A	M	U	R	G	J	S	P	T	O	O
M	E	A	E	Í	B	O	R	Í	T	O	L
A	I	R	B	A	R	R	A	T	I	U	G
J	O	A	L	Ñ	X	R	D	S	N	A	V
D	K	C	A	R	A	L	I	A	B	L	E
Ó	B	A	N	D	E	R	A	S	Y	I	R
M	Ú	S	I	C	A	Ú	N	O	A	U	D
X	R	M	J	W	S	K	T	C	M	G	E
H	O	A	C	O	R	D	E	Ó	N	Á	W
C	X	L	O	M	A	T	S	E	I	F	É

దేశాలు ఎక్కడున్నాయ్!

చిన్నారులూ.. పైన అక్షరాల సమూహం ఉంది చూశారుగా! అందులో కొన్ని దేశాల పేర్లు దాక్కున్నాయి. వాటిని ఆ పక్కనే ఇచ్చాం. మీరు వెతికి పట్టుకోవాలి. ఇవి అడ్డంగా, నిలువుగా, వంకరగా... ఎలాగైనా ఉండొచ్చు. అవి ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టేయండి.

ఎన్నున్నాయ్

పిల్లలూ... పక్క చతుర్భుజంలో మరికొన్ని చిన్న చతుర్భుజాలు ఉన్నాయి. ఇంతకీ అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కపెట్టి చెప్పండే!



జవాబులు:

ఆరువరుసలు: 24 మందిని విడివిడిగా ఆరు వరుసల్లో నిలబెట్టకూడదు. ఆరు వరుసలు షడ్భుజాకారంలో ఉండేటట్లు నిలబెడితే సరిపోతుంది.

ఎన్నున్నాయ్: 30.

ఒకే గీతతో...



రెండుతో నాలుగు



మాటల కోట - 57

రూపకల్పన : కర్లపాలెం

■	1	2		■	3	4		■
5	■		■	6	■		■	7
8	9	■	10			■	11	
12		■	■		■	■	13	
	■	14		■	15	16	■	
■	17		■	18	■	19	20	■
21		■	22			■	23	24
	■	25	■		■	26	■	
■	27			■	28			■

అడ్డం :

1. విషాదం కాదు. దానికి పూర్తిగా వ్యతిరేకమైనది (3)
3. తమిళనాట నది (3)
8. రానురానంటూనే చిన్నదీ... రాములోరి గుడికొచ్చిందోయ్ చిన్నదీ (2)
10. గాంధారి మాతృదేశం (3)
11. యస్! (2)
12. ఏ... అయితేనేమి... పళ్లూడగొట్టుకోడానికి! (2)
13. రామలక్ష్మణుల్లో పెద్దవాడు? (2)
14. తెలుగువాడి సాహిత్యంలో ప్రత్యేకమైనది, కావ్యం (2)
15. మాజీ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఇంటిపేరు, డబ్బులా? (2)
17. మన్ను జంట పదం (2)
19. మోహన్‌బాబు ఇంటిపేరు ఇంత చల్లగా వుంటుందా? (2)
21. ....కి ఎగరలేని అమ్మ స్వర్గానికి ఎగిరిందని సామెత (2)
22. దీక్షలోనూ యోగా చేసిన బాబా (3)
23. ...అటునుంచి కరిచినా ర్యాబిస్ ఇంజక్షన్ తీసుకోవాల్సిందే (2)
27. ప్రబంధాలలో ఈ కవి మీద వర్ణన తప్పనిసరి అని నిబంధన (3)
28. టూజీ స్పెక్ట్రమ్ తాజా నిందితుడు, కరుణానిధి బంధువే! (3)

నిలువు :

2. ఇది ఉన్నవాడిదే రాజ్యం (2)
4. విస్సన్న చెప్పిన .... వినరా! (2)
5. ఏరువాక సాగాలోయ్..! అని రాసిన సినిమా కవిని ఆ కొసనుంచీ ఆరంభించు (4)
6. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డు (3)
7. 'అత్తగారి కథలు' రాసిన 'మల్లీశ్వరి' (4)
9. చందమామను 'దా!దా!' అని పిలూ! (2)
11. ఆశ్చర్యార్థక పదం! (2)
16. పుష్పం (2)
17. మట్టి (2)
18. నా జీవితమే నా .... అన్నారు గాంధీజీ (3)
20. నక్షత్రం, సారా, అందమైన అమ్మాయి (2)
21. లవణం (2)
24. ఒప్పుల .... వయ్యారి భామ (2)
25. వక్క (2)
26. చంద్రగుప్త మౌర్యుని తల్లి (2)

మాటలకోట - 56 జవాబు

■	1 భా	2 ర	తం	■	3 వి	4 వా	హం	■
5 శ్రీ	■	గ్గ	■	6 పా	■	న	■	7 గొ
8 రం	పం	■	9 ము	న	క	■	10 జా	డ
గం	■	11 మ	■	కం	■	12 ప	■	వ
■	13 న	మ	స్తే	■	14 ప్ర	రా	పా	■
15 గం	■	త	■	16 కా	■	కు	■	17 బ
18 గూ	డు	■	19 ల	వ	ణం	■	20 క	ల
లీ	■	21 వ	■	లి	■	22 సా	■	పం
■	23 ప	ల్ల	కి	■	24 గా	రె	లు	■

మల్లమ్మ

మధుప్రియ కలవారి అమ్మాయి. వాళ్ల నాన్న పెద్ద కిరాణా దుకాణం నడుపుతుంటాడు. వారికి మూడంతస్తుల మేడ వుంది. ఆ మేడ పక్కనే ఒక పూరిగుడిసె ఉంది. అందులో మల్లమ్మ అనే విద్యార్థిని తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. ఇద్దరూ భానుపురి ఉన్నత పాఠశాలలోనే చదువుతున్నారు. కానీ మధుప్రియ ఎప్పుడూ మల్లమ్మతో మాట్లాడేది కాదు. ఒకవేళ మల్లమ్మే చొరవచేసి పలకరించినా "కారులో తిరిగే నేనెక్కడ? కాలినడకన, చెప్పల్లేకుండా తిరిగే నువ్వెక్కడ?" అంటూ అవమానించేది. మల్లమ్మ ఎవరితోనూ పరుషంగా మాట్లాడేది కాదు. ఆమె మార్కులు చూసి, ఆ పాఠశాల హెడ్‌మాస్టారు ఫీజు లేకుండా చేర్చుకున్నారు. మల్లమ్మకు రెండు జతల బట్టలే ఉన్నాయి. అవి కూడా ముతకవి. పగలంతా స్కూలుకి వెళ్లి వస్తుంది. సాయంత్రం కాగానే తల్లిదండ్రులు ఈతసువ్వతో అల్లిన పేడతట్టల్ని నెత్తిన పెట్టుకుని అంగట్లో తిరిగి అమ్మేది. వచ్చిన డబ్బుతో బియ్యం కొనుక్కొచ్చేది. అన్నం తిని ఎంచక్కా బుడ్డి వెలుతురులోనే పాఠాలు చదువుకునేది. ప్రియ వాళ్ల మేడమీద నుండి చూస్తే గుడిసెలోని మల్లమ్మ కనిపించేది.

ప్రియ ఇంటికి వెళ్లగానే వాళ్లమ్మ స్కూలు బ్యాగ్ అందుకుని, చక్కగా బూస్ట్ కలిపిన పాలు ఇచ్చేది. "నాకు ఇది వద్దు. బోర్నవిటా కావాలి" అని మారాం చేసేది ప్రియ. తల్లి బతిమాలాక టీవీ చూస్తూ ఎలాగోలా తాగేది. తర్వాత తమ పామేరియన్ కుక్కపిల్లతో, ఇంటి ముందున్న లాన్‌లో ఆడుకునేది. పక్కింటి పద్మజతో కలిసి వీడియో గేమ్స్ ఆడేది. వాళ్ల నాన్న ఇంటికి రాగానే పక్కన చేరి, తనను, తన దుస్తులను ఎవరెవరు మెచ్చుకున్నారో గొప్పగా చెప్పేది. ప్రియకు రెండు బీరువాల నిండా రంగు రంగుల బట్టలున్నాయి మరి. తన అందాన్ని, ఐశ్వర్యాన్ని బట్టల్లో చూసుకుని మురిసిపోతుంటుంది. ఎక్కడ కొత్త డ్రెస్సు కనపడ్డా కొనేదాకా మారాం చేసేది. తల్లి హోంవర్క్ చేయిస్తుంటే మధ్యలోనే నిద్రలోకి జారుకునేది.

ఆ ఏడాది జనవరి 26 సందర్భంగా పాఠశాలలో రకరకాల పోటీలు జరిగాయి. కబడ్డీ, పరుగు పందెం వంటి ఆటల్లోనే కాక, వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో కూడా మల్లమ్మే ఫస్టు వచ్చింది. ప్రియ పాల్గొన్న అన్నింట్లోనూ ఓడిపోయింది. ఒక్క బహుమతి కూడా రాలేదు. జెండా వందనం ముగిశాక హెచ్.ఎం, డి.ఇ.ఒ పిల్లలకు బహుమతులు అందజేశారు. ఆటల్లోనే కాక, గత ఏడాది తొమ్మిదవ తరగతిలో మంచి మార్కులు సాధించినందుకు ఉత్తమ విద్యార్థి బహుమతి కూడా మల్లమ్మకే దక్కింది. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా విద్యాధికారి "ఈ అమ్మాయి మన జిల్లాకే గర్వకారణం" అని జనరల్ నాలెడ్జ్ పుస్తకాల సెట్‌ను బహూకరించారు. పిల్లలు, ఉపాధ్యాయులు మల్లమ్మను ఎంతో అభినందించారు. చేతిలో పట్టనన్ని బహుమతులతో ఆనందంగా తన ఇంటికి చేరుకుంది.



మల్లమ్మ విజయాన్ని చూసి తట్టుకోలేని ప్రియ ఏడుస్తూ ఇంటికి చేరుకుంది. "నాకు ఒక్క బహుమతి కూడా రాలేదు. గుడిసె మల్లమ్మకు ఎన్నో ప్రైజులు వచ్చాయి. అందరూ తననే మెచ్చుకుంటున్నారు. నేను చెప్పిన సమాధానాలు విని అందరూ నవ్వారు" అని తల్లితో చెప్పి బోరుమంది.

"ఆ అమ్మాయి టీచర్ చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని చదువుకుంది. గర్వం లేదు. తన లోపాలకు ఇతరులను నిందించదు. కష్టం తెలిసిన అమ్మాయి కాబట్టి చదువు తప్ప మరో ధ్యాస లేదు. మనం బట్టలు వేసుకునేది దేహాన్ని కప్పడానికే కానీ, దుస్తులు ప్రదర్శించడానికి కాదని గాంధీతాత అన్నాడు తెలుసా? నీకు రకరకాల బట్టలు కావాలి. మార్కెట్లో దొరికే అన్ని రకాల కాస్మొటిక్స్ కావాలి. అలంకరణ మీద, ఆటల మీద చూపించిన శ్రద్ధ, చదువు మీద చూపించడం లేదు. అందుకే వెనుకబడ్డావు. ఇప్పటికైనా గర్వాన్ని విడిచిపెట్టి, చదువుమీద ధ్యాస పెడితే తప్పక విజయం సాధిస్తావు. నువ్వూ బహుమతులు పొందుతావు" అని హితబోధ చేసింది తల్లి.

ప్రియకు వాస్తవం బోధపడింది. గర్వం వదిలేసి, మల్లమ్మతో స్నేహం పెంచుకుంది. చదువును ప్రేమించడం మొదలుపెట్టి, తనూ మంచి మార్కులు తెచ్చుకోసాగింది.

- పుప్పాల కృష్ణమూర్తి







హుస్సేన్ చిత్రరాజాలు